ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
విశాఖపట్నం
జిల్లా వార్తలు
బుధవారం 6 మార్చి 2024



ఆలస్యమయ్యిందని అనుమతించకపోవడంతో వెనుతిరిగిన విద్యార్థులు

విద్యార్థుల అగచాట్లు

- సీఎం సమావేశం కోసం ఇటు ఇచ్ఛాపురం నుంచి అటు ఏలూరు వరకు గల విద్యార్థులు నగరానికి తరలింపు
- ఉదయం 9 గంటలకు కన్వెన్షన్ హాలులోకి పంపించిన అధికారులు
- మధ్యాహ్నం 3.30 గంటల వరకు లోపలే...
- ఆకలితో విలవిల్లాడిన విద్యార్థులు..
- ఆలస్యంగా వచ్చారని అనుమతించకపోవడంతో బయటే ఉండిపోయిన పలువురు

విశాఖపట్నం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి):

ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం పోతినమల్లయ్యపాలెంలోని 'వి' కన్వెన్షన్ హాలులో 'ది కాస్కేడింగ్ స్కిల్స్-భవిత' పేరిట నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సభకు సీఎం హాజరవుతున్నారని ప్రభుత్వం రాష్ట్రంలోని అనేక ప్రాంతాల నుంచి వందలాది మంది విద్యార్థులను రప్పించింది. వివిధ కోర్సులు పూర్తిచేసిన, శిక్షణ పొందిన, ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు/ యువకులను కార్యక్రమానికి తప్పనిసరిగా పంపించాల్సిందిగా ఆయా కళాశాలలు, సంస్థలకు అధికారుల నుంచి ఆదేశాలు అందాయి. విద్యార్థులను తీసుకువచ్చే బాధ్యతను కూడా ఆయా శిక్షణ సంస్థలు, కాలేజీలకే అప్పగించారు. ఇటు ఇచ్ఛాపురం నుంచి అటు ఏలూరు, రాజమండ్రి, కాకినాడ వంటి ప్రాంతాల నుంచి వందలాది మంది విద్యార్థులను ఈ సమావేశానికి తీసుకువచ్చారు. సీఎం పన్నెండు గంటలకల్లా కన్వెన్షన్ సెంటర్‌కు వస్తారంటూ...అంతకు మూడు గంటలు ముందే అంటే ఉదయం తొమ్మిది గంటలకే విద్యార్థులను లోనికి పంపించారు. కానీ, ఆయన మధ్యాహ్నం 1.20 గంటల సమయంలో వచ్చారు. దాదాపు రెండు గంటలపాటు సభలో పాల్గొన్నారు. కార్యక్రమం పూర్తయ్యేసరికి మధ్యాహ్నం 3.30 అయ్యింది. సుమారు ఆరున్నర గంటలపాటు కన్వెన్షన్ హాలులో ఉండాల్సి రావడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చాలామంది విద్యార్థులకు స్నాక్స్, మంచినీరు కూడా అందకపోవడంతో ఆకలితో అలమటించారు. మధ్యాహ్నం 3.30 గంటల తరువాత బయటకు వచ్చిన విద్యార్థులకు 'వి' కన్వెన్షన్ ప్రాంగణంలో భోజనం ఏర్పాట్లు చేయలేదు. అక్కడే ఉన్న పలువురు అధికారులను భోజనం గురించి ఆరా తీయడంతో...వచ్చిన బస్సుల్లో ఏర్పాటు చేశామని సమాధానం ఇచ్చారు.

బయటే ఉండిపోయిన విద్యార్థులు

ఈ సభలో పాల్గొనేందుకు కాకినాడ, ఏలూరు నుంచి వచ్చిన పలువురు విద్యార్థులు కన్వెన్షన్ హాలు బయటే ఉండిపోయారు. సమయానికి రాకపోవడంతో పోలీసులు వారిని అనుమతించలేదు. ఐడీ కార్డులు ఉన్నాయని చెప్పినా పట్టించుకోకపోవడంతో విద్యార్థులు కన్వెన్షన్ హాలు బయట ఉన్న చెట్ల కింద ఉండిపోయారు. కొందరు తాము వచ్చిన బస్సుల్లోకి వెళ్లి కూర్చున్నారు. అంత దూరం నుంచి కష్టపడి వస్తే కనీసం లోపలకు పంపించకపోవడం దారుణమని, ఆ మాత్రం దానికి తీసుకురావడం ఎందుకని పలువురు ప్రశ్నించారు.



ఎండాడలో సీఎం రాక సందర్భంగా అధికారులు మూసివేయించిన దుకాణాలు

మండుటెండలో మహిళల పాట్లు



సీఎంకు స్వాగతం పలికేందుకు పీఎం పాలెంలో మహిళలను ఎండలో నిలబెట్టిన దృశ్యం - వివరాలు మెయిన్ ఎడిషన్‌లో

దుకాణాలు బంద్

- మద్యం దుకాణాలకు మాత్రం మినహాయింపు
- సీఎం జగన్ పర్యటనలో అధికారుల వింతవైఖరి
- చిరు వ్యాపారులకు పారిశ్రామికవేత్తలుగా కలరింగ్
- డెలిగేట్లుగా పాస్‌లు జారీచేసిన అధికారులు



ఎండాడలో తెరిచివున్న మద్యం షాపు

విశాఖపట్నం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి):

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నగర పర్యటన సందర్భంగా అధికారుల అత్యుత్సాహం ప్రదర్శించారు. భద్రత పేరుతో ఆయన ప్రయాణించే మార్గంలో గల దుకాణాలన్నింటినీ మూసివేయించారు. నిత్యావసర దుకాణాలతోపాటు మందుల దుకాణాలకు కూడా తెరవనివ్వలేదు. కానీ ప్రభుత్వ మద్యం దుకాణాలను మాత్రం మినహాయింపు ఇచ్చారు. మద్యం దుకాణాలను మూసివేయించేస్తే ఆ నాలుగైదు గంటల్లో విక్రయాలు నిలిచిపోయి, ప్రభుత్వ ఖజానాకు ఆదాయం ఎక్కడ తగ్గిపోతుందోనని భావించినట్టున్నారని పలువురు వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఇక దుకాణాలను మూసివేయించిన అధికారులు, భవన నిర్మాణ సామగ్రి ఉన్నట్టయితే బయటకు కనిపించకుండా గ్రీన్‌మ్యాట్‌లతో కప్పివేయించారు. ఇదిలావుండగా సీఎం జగన్ మంగళవారం రాడిసన్‌బ్లూ హోటల్‌లో 'వైజాగ్ విజన్-ఫ్యూచర్ విశాఖ' పేరుతో రెండు వేల మంది పారిశ్రామికవేత్తలతో సమావేశం అవుతారని అధికారులు ప్రకటించారు. అయితే పారిశ్రామికవేత్తల పేరుతో నగరంలోని ఒక స్వీట్ దుకాణం యజమానికి, మరో ఫంక్షన్‌హాల్ యజమానికి పాస్‌లు జారీచేసి సదస్సుకు ... మిగతా 4వ పేజీలో

సీఎం నోట అదే పాట

విశాఖపట్నం వచ్చేస్తా... మూడేళ్లుగా ఇదే వరుస

- అదిగో, ఇదిగో... అంటున్న పార్టీ నేతలు
- తాజా ప్రకటన వెనుక రాజకీయ వ్యూహం
- త్వరలో జరగనున్న ఎన్నికల్లో లబ్ధి పొందేందుకేనంటున్న రాజకీయ విశ్లేషకులు

విశాఖపట్నం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి):

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గత మూడేళ్లుగా ఏ వేదిక ఎక్కినా...'విశాఖపట్నానికి షిఫ్ట్ అవుతున్నా...మీరు కూడా రండి'...అంటూ చెబుతూ వస్తున్నారు. తన కేబినెట్‌లోని మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్‌తో పాటు పార్టీ నేతలు విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, స్థానిక ఎమ్మెల్యేలతో ఇదే మాట పదేపదే చెప్పిస్తున్నారు. తాజాగా మంగళవారం నగరంలోని రాడిసన్ హోటల్‌లో 'విజన్ విశాఖ' పేరుతో నిర్వహించిన సదస్సులో కూడా ఇదే మాట చెప్పారు. తాను విశాఖపట్నం వస్తానంటే ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని, మీడియా వ్యతిరేక కథనాలు ప్రచురిస్తున్నదని, ఈసారి ఏదేమైనా సరే ఎన్నికలు ముగిసిన తరువాత ఇక్కడే నివాసం ఉంటానని, విశాఖలోనే ప్రమాణ స్వీకారం చేస్తానని స్పష్టం చేశారు. విశాఖలో అన్ని వసతులు ఉన్నాయని ఒక వైపు ఒప్పుకుంటూనే ఈ ప్రాంతం వెనుకబడింది...అందుకే ఇక్కడి నుంచి పరిపాలన చేయాలనుకుంటున్నా, ఉత్తరాంధ్రాను ఉద్ధరిస్తా అంటూ మోసపూరిత మాటలు చెబుతున్నారు.



'విజన్ విశాఖ' సావనీర్‌ను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి

వస్తా..వస్తా అని చెప్పడం ఎందుకు..రావొచ్చుగా..?

- విశాఖలో ఉంటానంటూ సీఎం పదే పదే ప్రకటనలు చేస్తున్నారు. తెలుగు సినిమా రంగానికి చెందిన ప్రముఖులంతా రెండేళ్ల క్రితం హైదరాబాద్ నుంచి తాడేపల్లి వెళ్లి ముఖ్యమంత్రిని కలిశారు. ఆ సమయంలో వారితో మాట్లాడుతూ కూడా 'నేను విశాఖకు మారుతున్నా. మీరు కూడా రండి. స్టూడియోలకు మంచి భూములు ఇస్తా' అని చెప్పారు.
- గత ఏడాది మార్చిలో విశాఖలో పెట్టుబడిదారుల సదస్సు నిర్వహించారు. దానికి నెల రోజుల ముందు ఢిల్లీలో రోడ్ షో చేశారు. ఆ సమావేశంలో పాల్గొన్న సీఎం ఇతర రాష్ట్రాల పారిశ్రామివేత్తలను ఉద్దేశించి మాట్లాడుతూ, తాను త్వరలోనే విశాఖకు మారుతున్నానని, మీరు కూడా రండి...అంటూ పిలుపునిచ్చారు. మార్చి 4వ తేదీన జరిగిన సదస్సులో కూడా త్వరలో విశాఖకు మారుతున్నానంటూ ప్రకటించారు.
- 2022 దసరాకు సీఎం విశాఖపట్నం వచ్చేస్తారని మంత్రి బొత్స సత్యనారాయణ పలు సందర్భాల్లో ప్రకటించారు.
- గత ఏడాది జనవరిలో విశాఖలో ఐటీ కంపెనీలు అన్నీ కలిసి మారియట్ హోటల్‌లో సదస్సు నిర్వహించాయి. ఆ సమావేశానికి హాజరైన ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఐటీ గురించి మాట్లాడకుండా, సీఎం ప్రస్తావన తీసుకువచ్చి, 'ఉగాదికి సీఎం విశాఖ వచ్చేస్తున్నారు. మీడియా ... మిగతా 4వ పేజీలో



సీఎంకు స్వాగతం పలికేందుకు విచ్చేసిన ప్రాంతానికి చేరుకున్న డ్వాక్రా గ్రూపు సభ్యులను ఫొటో తీస్తున్న అధ్యక్షురాలు

డెలిగేట్లుగా సచివాలయ సిబ్బంది

- ఏయూ ప్రొఫెసర్లంతా అక్కడే...
- ముఖం చాటేసిన నగరానికి చెందిన పారిశ్రామికవేత్తలు

విశాఖపట్నం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి):

'విజన్ విశాఖ' పేరుతో నగరంలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో మంగళవారం నిర్వహించిన సీఎం సమావేశానికి సచివాలయ సిబ్బందిని కూడా డెలిగేట్లుగా పంపించారు. ఈ సమావేశానికి ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వారితో కలిపి రెండు వేల మంది హాజరవుతారని ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ రెండు రోజుల క్రితం ప్రకటించారు. విశాఖలో పారిశ్రామికవేత్తలందరినీ రావాలని ... మిగతా 4వ పేజీలో



రాడిసన్‌బ్లూ హోటల్ వద్ద జీవీఎంసీ అభివృద్ధి పనుల శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

రూ.1528.92 కోట్లతో ఆరు ప్రాజెక్టులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శంకుస్థాపన

- ముడసర్లోవలో రూ.99.47 కోట్లతో జీవీఎంసీ కార్యాలయ భవన నిర్మాణం

విశాఖపట్నం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి):

జీవీఎంసీ పరిధిలో రూ.1528.92 కోట్లతో ఆరు పనులు చేపట్టేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. రాడిసన్ బ్లూ హోటల్‌లో పారిశ్రామికవేత్తలతో జరిగిన సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన ఆయన..హోటల్‌ప్రాంగణంలోనే ఆయా పనులకు సంబంధించిన శిలాఫలకాలను ఆవిష్కరించారు. జోన్-2 (మధురవాడ) పరిధిలో పారిశ్రామిక క్లస్టర్లతోపాటు గృహ అవసరాల కోసం రూ.595 కోట్లతో చేపట్టబోయే 15 ఎంజీడీ నీటి సరఫరా ప్రాజెక్టుకు, జోన్-2 ప్రాంతంలో సమగ్ర మురుగునీటి శుద్ధి, నెట్‌వర్క్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు రూ.553 కోట్లతో ప్రాజెక్టును, ముడసర్లోవ ప్రాంతంలో జీవీఎంసీ, విస్కో సంయుక్తంగా రూ.99.47 కోట్ల వ్యయంతో నిర్మించే జీవీఎంసీ ఇంటిగ్రేటెడ్ కార్యాలయ భవన నిర్మాణం, జోన్-5, జోన్-6, జోన్-8 పరిధిలో రూ.231.04 కోట్లతో నీటిసరఫరా, యూజీడీ అభివృద్ధి పనులు, సాగర్‌నగర్ బీచ్‌లో పర్యావరణ హితం కోసం రూ.15.65 కోట్లతో తాబేళ్ల అభివృద్ధి జోన్ ఏర్పాటు, సింహాచలం గిరి ప్రదక్షిణ కోసం జాతీయ రహదారికి సమాంతరంగా రూ.34.76 కోట్లతో రోడ్డు విస్తరణ పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రులు బొత్స సత్యనారాయణ, ఆదిమూలపు సురేష్, గుడివాడ అమర్‌నాథ్, విడదల రజని, విప్ కరణం ధర్మశ్రీ, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం నిధులు దారి మళ్లింపు

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు పథకాల కింద రహదారుల కోసం వందల కోట్ల రూపాయలు కేటాయింపు

- ఒక్క సీఆర్ఐఎఫ్ కిందే ఉమ్మడి జిల్లాకు రూ.100 కోట్లు
- ఏడీబీ నుంచి రూ.150 కోట్లు
- పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు చెల్లింపులు నిల్
- ఆ నిధులు ఇతర పథకాలకు వెచ్చించిన వైసీపీ ప్రభుత్వం



సెంట్రల్ రోడ్డు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిధులతో కశింకోట - బంగారుపేట మధ్య వేసిన 24 కిలో మీటర్ల రహదారి

విశాఖపట్నం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రహదారుల పునర్నిర్మాణం, మరమ్మతులను పూర్తిగా విస్మరించింది. రోడ్ల కోసం వేర్వేరు రూపాల్లో కేంద్రం అందించిన నిధులను కూడా పక్కదారి పట్టించింది. కాంట్రాక్టర్లకు రూ.వందల కోట్లు పెండింగ్‌లో పెట్టింది. దీంతో అనేక ప్రాంతాల్లో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి.

జిల్లాలో రోడ్లు, భవనాల శాఖ పరిధిలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు ప్రభుత్వం గడిచిన మూడేళ్లుగా బిల్లులు చెల్లించడం లేదు. ఆ మధ్య కాలంలో కోర్టు అక్షింతలు వేయడంతో కొంతవరకూ నాలుగో వంతు విడుదల చేసింది. ఇప్పటికీ సుమారు రూ.400 కోట్లు చెల్లించాల్సి ఉంది. బిల్లులు చెల్లించాలంటూ కాంట్రాక్టర్లు రెండేళ్లుగా గగ్గోలు పెడుతున్నా ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరిస్తోంది. ఒక మంత్రికి సంబంధించిన బిల్లులు మినహా మరే బిల్లు క్లియర్ కావడం లేదని వాపోతున్నారు.

భారీగా బకాయిలు

కేంద్ర ప్రభుత్వ నిధులతో రహదారుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్ల కిందట టెండర్లు పిలిచింది. అయితే బిల్లులు రావన్న ఉద్దేశంతో చాలామంది కాంట్రాక్టర్లు ముందుకురాలేదు. వారితో ప్రభుత్వ పెద్దలు మాట్లాడి, ఎప్పటికప్పుడు బిల్లులు క్లియర్ చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో కొంతమంది బిడ్లు వేశారు. కానీ ఆయా బిల్లులను ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టేసింది. సెంట్రల్ రోడ్డు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సీఆర్ఐఎఫ్) కింద జిల్లాకు కేంద్రం రూ.100 కోట్లు మంజూరుచేసింది. ఈ పనులను ఉమ్మడి జిల్లాలో నాలుగు భాగాలుగా విభజించి, ముగ్గురు, నలుగురు కాంట్రాక్టర్లు చేపట్టారు. ఒక్కో కాంట్రాక్టర్‌కు రూ.15 నుంచి రూ.30 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. అయితే సీఆర్ఐఎఫ్‌కు సంబంధించి ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా క్లియర్ చేయలేదని కాంట్రాక్టర్లు వాపోతున్నారు.

అలాగే న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఏడీబీ) అందించిన రూ.150 కోట్లతో ఉమ్మడి జిల్లాలో పలు ప్రాంతాల్లో పనులు ... మిగతా 4వ పేజీలో

వలంటీర్ల వాట్సాప్ గ్రూపులో సీఎం ప్రసంగం

విశాఖపట్నం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం అధికారులు మరో విచిత్ర ప్రయోగం చేశారు. 'విజన్ విశాఖ' పేరిట ఏర్పాటుచేసిన సదస్సులో సీఎం జగన్ చేసిన ప్రసంగంలో కీలక వ్యాఖ్యలను వలంటీర్ల వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం చేయించారు. 'ఎన్నికల తరువాత విశాఖలో ఉంటా. ఇక్కడే ప్రమాణ స్వీకారం చేస్తా' అనే మాటలను నగరంలోని వలంటీర్లు అంతా వారి గ్రూపుల్లో పెట్టాలని ఆదేశించారు. నెల రోజుల క్రితమే వలంటీర్లు వారి పరిధిలోని 50 ఇళ్ల యజమానులతో 'వలంటీర్స్ గ్రూపు' ఒకటి క్రియేట్ చేశారు. అందులో వైసీపీకి చెందిన అంశాలనే పోస్ట్ చేస్తున్నారు. తాజాగా మంగళవారం సీఎం ప్రసంగం క్లిప్పింగ్ పోస్ట్ చేశారు.



ఫిష్ ఆంధ్ర షాపు తెరవడం లేదని

ఫిషరీస్ అసిస్టెంట్ సస్పెన్షన్!

విశాఖపట్నం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్ర ప్రభుత్వం చేపల విక్రయానికి 'ఫిష్ ఆంధ్ర' పేరుతో అనేక ప్రాంతాల్లో దుకాణాలు ఏర్పాటుచేయించింది. ఆ దుకాణాల ఏర్పాటు, నిర్వహణ అంతా సచివాలయ సిబ్బంది చూసుకోవాల్సి ఉంటుంది. అయితే, ఒక వ్యక్తికి అప్పగించిన షాపు సక్రమంగా తీయడం లేదంటూ...అందుకు బాధ్యుడిని చేస్తూ ఫిషరీస్ అసిస్టెంట్‌ను అధికారులు సస్పెండ్ చేశారు. సీఎంను కలిసి తనకు న్యాయం చేయాల్సిందిగా కోరేందుకు సదరు ఉద్యోగి మంగళవారం పీఎం పాలెంలోని 'వి' కన్వెన్షన్ హాలు వద్దకు వచ్చారు. ఉద్యోగి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.

దాకమర్రి సచివాలయంలో వాసుపల్లి ఎల్లాజీ ఫిషరీస్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. 2019లో ఆయనకు ఉద్యోగం వచ్చింది. ఏపీ ప్రభుత్వం ఫిష్ ఆంధ్ర అవుట్‌లెట్లను ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. ఆ మేరకు అవుట్‌లెట్లు (షాపు) ఏర్పాటుచేసే బాధ్యతను సచివాలయంలోని ఫిషరీస్ అసిస్టెంట్లకు ఉన్నతాధికారులు అప్పగించారు. ఎల్లాజీ తన పరిధిలో షాపు కోసం అనేక ప్రాంతాలు తిరిగారు. షాపులు దొరకక, పనిచేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో చాలా రోజులపాటు శ్రమించాల్సి వచ్చింది. ఎట్టకేలకు గంగవరంలో ఒక షాపు దొరకగా, దానిని అక్కడే ఉండే మరో వ్యక్తితో ఏర్పాటు చేయించారు. అయితే, అతను కుటుంబ సమస్యలతో కొద్దిరోజుల నుంచి షాపు తెరవడం లేదు. ఫిషరీస్ అసిస్టెంట్లు ప్రతిరోజు షాపు ఫొటోను తీసి ఉన్నతాధికారులకు పెట్టాల్సి ఉంటుంది. ప్రతిరోజూ క్లోజ్ చేసిన షాపు ఫొటో పెడుతుండడంతో ఉన్నతాధికారులు తీవ్రంగా దుర్భాషలాడి విధుల నుంచి గత నెలలో సస్పెండ్ చేశారు. దీనిపై సీఎంను కలిసేందుకు వచ్చిన ఆయన్ను పోలీసులు లోపలకు వెళ్లకుండా అడ్డుకున్నారు. షాపు పెట్టించడం దగ్గర నుంచి తీయించడం వరకు భారమంతా తమపై వేస్తే ఎలాగని ఎల్లాజీ ఆవేదన వ్యక్తం చేశారు.

'ప్రజాదర్బార్'కు స్పందన కరువు



పెదజాలరిపేట వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌లో జనం లేని దృశ్యం

జగదాంబ కూడలి, మార్చి 5: దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌కు ప్రజలనుంచి స్పందన కరవవుతోంది. మంగళవారం గ్రేటర్ 30వ వార్డులో మూడు వార్డులకు సంబంధించి ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్ వద్దకు సమస్యలను వివరించడానికి స్థానికులు ఎవరూ పెద్దగా రాలేదు. ఎమ్మెల్యే కూడా లేకపోవడంతో ఆయన పీఏ, వైసీపీ వార్డు నాయకులు వచ్చిన వారిని వినతులుస్వీకరించి మమ అనిపించారు. కొన్నాళ్లుగా ఎమ్మెల్యే వాసుపల్లి వారంలో మూడు రోజులు ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్నట్టు ప్రచారం చేసుకుంటున్నారు. కానీ, జనాల్లో మాత్రం ఫిర్యాదులు, వినతులకు పరిష్కారం లభించడంలేదని అసంతృప్తి వ్యక్తమవుతోంది. దీంతో కొద్దిరోజులుగా ప్రజాదర్బార్ అధికార పార్టీ నాయకులు, కార్యకర్తల హంగామాకు పరిమితమవుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పలుమార్లు ఇళ్లు, స్థలాలు, పింఛన్లతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నా పెద్దగా ప్రయోజనంలేకపోవడంతో జనాలు ప్రజాదర్బార్‌కు వచ్చే వారి సంఖ్య క్రమేపీ తగ్గిపోతోందన్న మాట వినిపిస్తోంది. ఎమ్మెల్యే వాసుపల్లి స్వయంగా అర్జీలు స్వీకరించినా ఫలితం కానరావడంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్నికల ముందు ప్రజాదర్బార్‌కు స్పందన కొరవడంపై రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.

7న దాసి సినిమా ఉచిత ప్రదర్శన

డాబాగార్డెన్స్, మార్చి 5: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 7న విశాఖ పౌరగ్రంథాయలంలో దాసి సినిమా ఉచితంగా ప్రదర్శించనున్నట్టు వీఎఫ్ఎస్ కార్యదర్శి ప్రకాశరావు తెలిపారు. బి.నర్సింగరావు దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం పలు జాతీయ అవార్డులు పొందిందన్నారు. సీనియర్ రంగస్థల నటి దూసి అనురాధను సత్కరిస్తామన్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'తూర్పు కాపులకు అధిక అసెంబ్లీ టికెట్లు కేటాయించాలి'

డాబాగార్డెన్స్, మార్చి 5: రానున్న ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీలు ఉత్తరాంధ్రలో తూర్పు కాపులకు తగినన్ని అసెంబ్లీ టికెట్లు కేటాయించాలని ఏపీ తూర్పు కాపు సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మజ్జి అప్పారావు కోరారు. మంగళవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భీమిలిలో తూర్పుకాపులు ఎక్కువ మంది ఉన్న నేపథ్యంలో ప్రధాన పార్టీలన్నీ అక్కడ తమసామాజిక వర్గానికి టికెట్ కేటాయించాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి మంత్రి వెంకట రమణమూర్తి మాట్లాడుతూ రాజకీయపార్టీలు తమ వైఖరిమార్చుకోవాలన్నారు. తూర్పుకాపులంతా రాజకీయంగా బలోపేతం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర నాయకుడు కేవీఎల్ నాయుడు మాట్లాడుతూ తుర్పుకాపులకు తగిన టికెట్లు కేటాయించకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

మురళీనగర్ పార్కు నిర్వహణ భేష్



గాంధీ విగ్రహం ఎదుట సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

మాధవధార, ఫిబ్రవరి 5; గ్రేటర్ 50వ వార్డు పరిధి మురళీనగర్‌లో వైశాఖీ స్పోర్ట్సు పార్కు (స్కేటింగ్ పార్కు)ని మంగళవారం ఉదయం సీబీఐ మాజీ జేడీ వి.వి. లక్ష్మీనారాయణ సందర్శించారు. నగరంలో నివాసం ఉంటున్న ఆయన ఇక్కడి ఈ పార్కుని ఎప్పటినుంచో సందర్శించాలనే కోరిక మేరకు వచ్చినట్టు ఆయన తెలిపారు. పార్కు నిర్వహణ కమిటీ అధ్యక్షులు సనపల. వరప్రసాద్, కార్యదర్శి పి.వి.ఎస్.ఎన్.రాజు ఆయనకు తొలుత స్వాగతం పలికారు. అనంతరం లక్ష్మీనారాయణ పార్కులో గాంధీ స్మారక విగ్రహం, స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ సహా ఇటీవలే ఏర్పాటు చేసిన బుద్ధుని విగ్రహాలను సందర్శించి నిర్వహణ కమిటీని ఈ సందర్భంగా అభినందించారు. పార్కు ప్రతినిధులు ఆయనను మర్యాదపూర్వకంగా సత్కరించారు. రాజకీయ చర్చలకు అతీతంగా ఈ పర్యటన సాగినట్లు పార్కు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

'మహిళలు స్వతంత్రంగా ఎదగాలి'



మాట్లాడుతున్న శ్యామలదీపిక

మురళీనగర్, మార్చి 5; మాధవధార మహిళా వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం మురళీనగర్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో అధ్యక్షురాలు ఎస్.లలితారెడ్డి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్ ఎలెక్టెడ్ ప్రెసిడెంట్ ఎం.ప్రభావతి ముఖ్యఅతిథిగా హాజరై మహిళా సాధికారతపై మాట్లాడారు. గౌరవ అతిథిగా పాల్గొన్న ఉత్తర నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు కుమార్తె శ్యామలదీపిక మహిళా దినోత్సవం ప్రత్యేకతతో పాటు, సమాజంలో మహిళల పాత్రను వివరించారు. మహిళలు స్వతంత్రంగా ఎదగాలని అన్నారు. కార్యక్రమంలో నగల దుకాణం భీమాస్, శ్రీరామ్ ఇన్సురెన్స్ కంపెనీలు అందించిన సాయంతో మహిళలకు బహుమతులు అందించారు. మధ్యాహ్నం భోజనాలు చేశారు. అనంతరం వంటల పోటీలు, జస్ట్‌ఫైవ్ నిర్వహించి విజేతలకు బహుమతులిచ్చారు. క్లబ్ సెక్రటరీ సి.హెచ్.లక్ష్మి, కోశాధికారి పి.కమల, కమిటీ సభ్యులు ఉన్నారు. వనితా వాకర్స్ క్లబ్‌లో ఈనెల 7వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు అధ్యక్షురాలు పి. ప్రభావతి తెలిపారు.



రంగులతో ధగధలాడుతున్న వంతెన



మరోవైపు గతుకులమయంగా ఫ్లైవోవర్ రోడ్డు

రంగులు సరే...రోడ్లు మాటేమిటి?

» కంచరపాలెం వంతెనకు రంగులు » ఫుట్‌పాత్‌లపై మొక్కల కుండీలతో ముస్తాబు » రోడ్డు మాత్రం అధ్వానం » రాకపోకలకు అవస్థలు

జ్ఞానాపురం, మార్చి 5 ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రభుత్వం ప్రచారానికి పెద్దపీట వేస్తోంది. అభివృద్ధి పనులు తక్కువగా చేపట్టినా వీటితో ప్రజల్లో ప్రయోజనం పొందేందుకు ఆసక్తి చూపుతున్నట్టు కనిపిస్తోంది. నగరంలో ఎక్కడచూసినా ఫుట్‌పాత్‌లు, గోడలకు రంగులు వేసి ముస్తాబు చేస్తున్నారు. ఈ కోవలో జ్ఞానాపురం-కంచరపాలెం నేతాజీ వంతెనను పూర్తిగా రంగులతో ముస్తాబు చేశారు. అంతవరకు బాగానే ఉన్నా, నిత్యం వాహనాల రద్దీ ఉండే రహదారులను మాత్రం పట్టించుకోవడంలేదు. దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కంచరపాలెం నుంచి జ్ఞానాపురం వరకు ఇరువైపులా ఈ వంతెన రోడ్లు గతుకులతోఅధ్వానంగామారడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నా ఇవేవీ ఏమాత్రం పట్టించుకోకుండా రూ.లక్షలు ఖర్చుపెట్టి ఫుట్‌పాత్‌లకు టైల్స్, రంగులు వేశారు. ఇటీవల డివైడర్లపై మొక్కల



రహదారి మధ్యలో పెచ్చులూడిన దృశ్యం

కుండీలు విరిగిపోవడంతోపత్రికల్లో కథనాలు రావడంతో ఉద్యాన వనశాఖ అధికారులు కొత్త కుండీలు,మొక్కలు ఏర్పాటు చేశారు. వేసి రెండు నెలలు పూర్తి కాకుండానే వాటిని పూర్తిగా తొలగించి మళ్లీ రూ. వేలకు వేలు డబ్బు వెచ్చించి ఇటీవల మళ్లీ కొత్త మొక్కలు, కుండీలు ఏర్పాటు చేశారు. వాటి పరిరక్షణను మాత్రం పట్టించుకోవడంలేదు. ప్రజాధనాన్ని ఇలా, జీవీఎంసీ అధికారులు ఎందుకు మట్టిపాలు చేస్తున్నారా? లేక గుత్తేదారుల మేలుకోసమే ఇలాంటి నిర్ణయాలుతీసుకుంటున్నారో అర్థంకావడంలేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. వంతెనపై రోడ్డు అధ్వాన స్థితిపైన ఫిర్యాదులు రావడంతో రెండు నెలల క్రితం అప్పటి కంచరపాలెంట్రాఫిక్ సీఐ చొరవతో మరమ్మతులు చేపట్టారు. రెండు రోజులపాటు ఒకవైపు రహదారిని మూసి మరీ ఈ పనులు పూర్తి చేశారు. అలాగే, ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపంతో గుత్తేదారు తూతూ మంత్రంగా ఈ వంతెన పనులు చేపట్టిన నెలరోజులకే గోతులు పడ్డాయి. ఇప్పుడు రూ. లక్షలు ఖర్చుచేసి ఇరువైపులా ముస్తాబు చేశారు. కానీ,రహదారి జోలికి మాత్రం అధికారులు పోలేదు. ఇబ్బందులు లేకుండా రోడ్లు నిర్మించాలని, ఇలా పైపై మెరుగులు వద్దని వాహనదారులు, స్థానికు లు డిమాండ్ చేస్తున్నారు.

సాహితీ రంగంలో అచ్యుత రామరాజుది ప్రత్యేక ముద్ర

» శత జయంతి ఉత్సవంలో సాహితీవేత్తలు



మాట్లాడుతున్న రచయిత బీవీ అప్పారావు

సీతంపేట, మార్చి 5: కళా ప్రపూర్ణ డాక్టర్ గణపతిరాజు అచ్యుత రామరాజు సాహితీ, సంస్కృతిక రంగాల్లో ఐదు దశాబ్దాలపాటు నగరంలో విశేష సేవలందించి ప్రత్యేక ముద్రవేశారని పలువురు వక్తలు కొనియాడారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో కళా ప్రపూర్ణ గణపతిరాజు అచ్యుత రామరాజు స్మారక సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో అచ్యుత రామరాజు శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు పెన్మత్స లలితా వాశిష్ట అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథులుగా విచ్చేసిన నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య బాలమోహన్‌దాస్, బీవీ అప్పారావు మాట్లాడుతూ విశాఖలో అచ్యుత రామరాజు సాహితీ రంగంలో అనేక మందితో కలిసిపనిచేశారన్నారు. నాటకాలు, కథలు రచించారన్నారు. నటుడిగా, వక్తగా రాణించారన్నారు. కళాప్రపూర్ణ గణపతిరాజు అచ్యుత రామరాజు శతజయంతి సంచిక, రచయిత పెన్మెత్స లలితావాశిష్ట రచించిన చిరుజల్లు కథల సంపుటిని ఆవిష్కరించారు. సెంచూరియన్ విశ్వవిద్యాలయం గౌరవ కులపతి ఆచార్య జీఎస్ఎన్ రాజు, ప్రముఖ కవి, కథా రచయిత భాగవతుల కృష్ణారావు, ప్రముఖ రంగస్థల నటులు డాక్టర్ మీగడ రామలింగ స్వామి, రచయిత, వ్యాసకర్త డాక్టర్ దామెర వెంకట సూర్యారావు, కథా రచయిత మల్లాప్రగడ రామారావు, రంగస్థల నటులు భళ్లమూడి రామ్మూర్తి, ఇంజనీరు, సినీనటులు పెన్మెత్స జగన్నాథరాజు, సత్యవాడ సోదరీమణులు రఘునాథమ్మ, సూర్యకుమారి, న్యాయవాది దంతులూరి మీనాక్షి, చిత్రకారుడు డాక్టర్ బుద్ధరాజుసూరజ్‌వర్మలను సంస్థ జీవన సాఫల్య పురస్కారాలతో సన్మానించారు. ప్రముఖ న్యాయవాది ఎస్ఎస్ఎస్‌వీఆర్ఎం రాజు, ప్రముఖ కథా, నవల రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు, రచయిత ఆదూరి సీతారామమూర్తి, మేడామస్తాన్ రెడ్డి, జగన్నాథరాజు తదితరులు పాల్గొన్నారు.

సేవాసదన్‌కు స్టీల్ సామగ్రి వితరణ

జ్ఞానాపురం, మార్చి 5: స్థానిక సెయింట్ జోసఫ్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ సిస్టర్ డా.డి. విరోనికా ఐదో వర్ధంతి సందర్భంగా జ్ఞానాపురంలోని నిర్మలహృదయ్ సేవాసదన్‌లో ఉన్న వృద్ధులకు స్టీల్ కంచాలు, గ్లాసులను కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ డా. షైజీ సహకారంతో సిబ్బంది వితరణ చేశారు. వాటితో పాటు గ్లూకోజ్ ప్యాకెట్లు, పండ్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో సిస్టర్లు మేరీజైన్, నాన్సీ, హేమ, డాక్టర్ పీకే జయలక్ష్మి, డా.హరిణి పాల్గొన్నారు.



వృద్ధులకు కంచాలు, గ్లాసులు అందిస్తున్న సిస్టర్లు

చట్టాలపై అవగాహన అవసరం

కంచరపాలెం, మార్చి 5 : చిన్నారులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ అర్బన్ సూపర్‌వైజర్ జ్యోతి పేర్కొన్నారు. స్థానిక రెడ్డికంచరపాలెం, జాషువానగర్ తదితర అంగన్‌వాడీ కేంద్రాలు, ఆర్పీపేట ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. విద్యార్థులతో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాలతో కలిగే నష్టాలు, చట్టాలను ఆమె వివరించారు. కౌమార దశలో వచ్చే ఆరోగ్య సమస్యలు, పోషకాహారం ప్రాధాన్యం అవగాహనకల్పించారు. హెచ్‌ఎం ఆర్.శ్రీనివాసరావు, అంగన్‌వాడీ కార్యకర్త దేవుడమ్మ పాల్గొన్నారు.

'టీడీపీ, జనసేన కూటమి గెలుపు తథ్యం'



రేసపువానిపాలెంలో ప్రచారం చేపడుతున్న జనసేన నాయకులు

సీతమ్మధార, మార్చి 5: రాష్ట్రంలో పరిపాలన పూర్తిగా ఆగమ్యగోచరంగా మారిందని, ఈస్థితిలో రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీల గెలుపు తథ్యమని జనసేన పార్టీ ఉత్తరనియోజకవర్గం సమన్వయకర్త పసుపులేటి ఉషాకిరణ్ పేర్కొన్నారు. గ్రేటర్ 24వ వార్డు రేసపువానిపాలెంలో పార్టీ వార్డు అధ్యక్షురాలు అమరాపు దుర్గ ఆధ్వర్యంలో జనంలోకి జనసేన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉషాకిరణ్ ఇంటింటికి వెళ్లి ప్రచారం చేపటారు. టీడీపీ, జనసేన పార్టీల మేనిఫెస్టోను అందజేశారు. రానున్న ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు అడబాల లక్ష్మి, మేరుగ నూకరాజు, గోపికల్యాణం, మోసెస్, గోరపల్లి శివ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకపఠనం తప్పనిసరి



చిన్నారులకు పుస్తకాలందిస్తున్న ఎంఈవో సోమేశ్వరరావు

కంచరపాలెం, మార్చి 5: విద్యార్థులు పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించుకోవాలని గోపాలపట్నం మండల విద్యాశాఖాధికారి అంబటి సోమేశ్వరరావు సూచించారు. జీవీఎంసీ ఆర్పీపేట ప్రాథమిక పాఠశాలలో ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ హ్యూమన్ వ్యాల్యూస్ వారు ఏర్పాటు చేసిన లైబ్రరీను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతు నిరంతరం పుస్తక పఠనంతో జ్ఞానంతో పాటు చక్కని క్రమశిక్షణ అలవడుతుందన్నారు. ఉపాధ్యాయిని అరుణకుమారి ఆర్ట్ ఆఫ్ లివింగ్, పుస్తకాలు చదవడంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం టి. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.అనంతర పాఠశాలలో చిన్నారుల చేతుల మీదుగా మొక్కలు నాటించారు.

చెత్త తొలగించరూ..



సీతంపేట కనకమ్మవారి ఆలయం ఎదురుగా పేరుకున్న చెత్త

సీతంపేట, మార్చి 5: గ్రేటర్ విశాఖ 25వ వార్డు సీతంపేట కనకమ్మవారి వీధిలో కనకమ్మవారి ఆలయం ఎదుట చెత్త పెద్ద ఎత్తున పేరుకుపోయింది. దీంతో ఆ ప్రాంతామంతా దుర్గంధం వెదజల్లడంతో పాటు దోమలు వ్యాప్తి చెందుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత శానిటరీ సిబ్బంది స్పందించి చెత్తను తొలగించాలని కోరుతున్నారు.

పదాల కోసం ప్రసవ వేదన అనుభవించాలి

» అప్పుడే మంచి పాట పుడుతుంది
» సినీ కవి సుద్దాల అశోక్ తేజ



[ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ]

భీమునిపట్నం (రూరల్) మార్చి 5

'ఒకటే జననం.. ఒకటే మరణం గెలుపు పొందు వరకూ... అలుపులేదు మనకు' అని యువతకు మార్గదర్శం చేసినా, 'నేను సైతం ప్రపంచానికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను.. అని విప్లవం రగిల్చినా.. ఆదివాసీ మహిళ 'నేడు చనిపోయి.. రేపు దప్పునై పుడతాను' అంటూ ఆత్మగౌరవ ప్రతీకను చాటినా ఆయన కలానికే సాధ్యమయింది. మనిషిలోని భావోద్వేగాలను తన కలం ద్వారా ప్రపంచానికి చాటిచెప్పడంలో ప్రత్యేకత సంతరించుకున్న సినీ గీత రచయితగా సుద్దాల అశోక్‌తేజ గుర్తింపు తెచ్చుకున్నారు. భీమిలి కళా సాహితీ సభలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ సినీ పరిశ్రమలో తన ప్రయాణాన్ని గుర్తుచేసుకున్నారు.

సినిమా పాట రాయడం అనుకున్నంత సులభం కాదని పదాల కోసం ప్రసవవేదన పడితేనే మంచి పాట పుడుతుందని సుద్దాల పేర్కొన్నారు.

దాసరి తీసిన ఒసే రాములమ్మ చిత్రంలో రాములమ్మను దొరలు కొడుతున్న సందర్భంలోని నేపథ్య గీతం కోసంఎంతో కష్టపడాల్సి వచ్చిందన్నారు. అర్థరాత్రి రెండుగంటల సమయంలో తడిబట్టలతో పాట రాశానని, ఆత్రేయలోని ఆత్రం, శ్రీశ్రీ ఉద్రేకం పాటలో ఉండాలనే దర్శకుడు దాసరి నారాయణరావు సూచనతో ఈ పాటకు ప్రాణం పోసానని గుర్తుచేసుకున్నారు. 'నేడు చచ్చిపోతున్నాను... రేపు డప్పై పుడతాను.. విప్లవమా వర్ధిల్లుమా..' చెమ్మగిల్లవే రాములమ్మా అనే పల్లవితో ఆ పాట సాగిందన్నారు.

ఆర్ఆర్ఆర్ చిత్రంలో ఒకే ట్యూన్‌తో రెండు పాటలు రాయాల్సి వచ్చిందని, కొమ్మా ఉయ్యాలా అంటూ సాఫీగా ఓ పాట, బ్రిటిష్‌వారు కొమురం భీంను కొట్టే సందర్భంలోని పాట 'కొమురం భీముడో... కొమురం భీముడో.. రగలాలి కొడుకో అంటూ మరో పాటను రాశానన్నారు. ఆ పాటలోని 'పుడమి తల్లికి జన్మ అరణం ఇచ్చొ' అనే వాక్యం గొప్పగా ఉంటుందన్నారు.

పాత్రధారులకు అనుగుణంగా పాట

సినిమాలోని నటీనటుల హావభావాలు, బాడీ లాంగ్వేజ్‌కు అనుగుణంగా పాటలు రాస్తేనే విజయవంతమవుతాయని అశోక్‌తేజ తెలిపారు. అల్లు రామలింగయ్య కోసం రాసిన 'ముత్యాలు వస్తావా పాట ఎన్టీఆర్ లాంటి నటుడి కోసం రాస్తే అభాసుపాలవుతామన్నారు. పాత్ర ఔచిత్యం, సందర్భానికి తగినట్టుగా పాట ఉండాలన్నారు.

భార్యను తల్లిగా, చెల్లిగా చూడాలి..

ప్రతి వ్యక్తి తన భార్యలో తల్లిని, చెల్లిని కూడా చూసినప్పుడే స్త్రీల పట్ల గౌరవం పెరుగుతుందని.. ప్రతి వ్యక్తి వెనుక విజయం వెనుక అతని భార్య ఉంటుందని, ఆమెను ముందుగా మెచ్చుకోవాలన్నారు. నాభార్య సహకారంతోనే సినిమా కవిగా నిలదొక్కుకున్నానని, స్ఫూర్తిదాయకమైన పాటలు రాసే అవకాశాలు కొన్నిసార్లు మాత్రమే వస్తాయన్నారు. 'ఒకటే జననం ఒకటే మరణం పాట ఇలానే పుట్టిందన్నారు.

కవులకు ఉత్తరాంధ్ర ప్రసిద్ధి

తెలంగాణతో పాటు ఉత్తరాంధ్ర కూడా పాటలకు పుట్టినిల్లని సుద్దాల వివరించారు. ఈ ప్రాంతంలోనే కొన్ని మాండలీకాలు పుట్టాయన్నారాయన. గురజాడ రాసిన 'దేశమును ప్రేమించుమన్నా' జాతీయ గీతంగా గుర్తింపు సాధించాల్సిన గొప్పదన్నారు. వంగపండు, సుబ్బారావు పాణిగ్రాహి, భూషణం తదితర కళాకారులు ఈ ప్రాంతంలోని వారేనన్నారు. వంగపండు ప్రసాదరావు పాల్గొన్న ఓ కార్యక్రమంలో పండు పండు పండు.. యాపిల్ దానిపేరు అనే పాటను పాడుతూ చివరిలో రైఫిల్ దానిపేరు అని ఆలపించడంతో అభినందనలు వెల్లువెత్తాయని గుర్తు చేసుకున్నారు.

మరిన్ని పాటలు రాయాలి

సినీ పరిశ్రమకు వచ్చి 30 ఏళ్లలో మూడు వేల పాటలు రాసినా తపన తీరలేదని. అన్ని పాటు సంతృప్తి కలిగించినా.. అంతకంటే మంచి పాట రాసే అవకాశం వెతుక్కుంటూ వచ్చిందని సుద్దాల తెలిపారు. కరీంనగర్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న తాను సినీ గీత రచయిత కావడంతోనే భీమునిపట్నం రాగలిగానన్నారు. ప్రాణం పోయేంతవరకు పాటలు రాయాలన్న తపన ఉందన్నారు.

జయహో బీసీ సభలో విశాఖ నేతలు



సభలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పీలా గోవింద తదితరులు

మహారాణిపేట, మార్చి 5:మంగళగిరిలో మంగళవారం నిర్వహించిన జయహో బీసీ సభకు విశాఖకు చెందిన పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు హాజరయ్యారు.పార్టీజిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతోపాటునేతలు పీలా గోవింద్ సత్యనారాయణ,పైలా ప్రసాదరావు, తమ్మిన విజయకుమార్, పి. కోటేశ్వరరావు తదితరులు, కార్యకర్తలు ఉన్నారు.

ఉన్నత పాఠశాల ఎదుట ఆకతాయిల బెడద



ఎన్‌జీజీఓస్ పాఠశాల ఎదుట ఆకతాయిల బాతాఖానీ

అక్కయ్యపాలెం, మార్చి 5 : గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల పరిసరాల్లో ఆకతాయిల బెడద అధికంగా ఉంది. పాఠశాల తెరిచినప్పటి నుంచి బైక్‌లతో గేట్ ఎదుట చక్కర్లు కొడుతూ రాకపోకలు సాగించే వాహనచోదకులు, పాదచారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. పాఠశాలకు వచ్చే విద్యార్థినిలతో అనుచితంగా ప్రవర్తిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై ప్రశ్నించే వారిని దుర్భాషలాడుతూ దాడికి దిగుతున్నారు. ఆకతాయి చేష్టలతో విద్యార్థినులు భయాందోళనకు లోనవుతున్నారు. పాఠశాల తెరిచినప్పుడు, ఇంటర్వెల్, మధ్యాహ్నం భోజనం సమయం, సాయంత్రం ఆకతాయిలు గేట్ ఎదుట రోడ్డుపై నిల్చుని విద్యార్థినులద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారు. అలాగే, కొంతమంది విద్యార్థులను దారి కాసి కొడుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సోమవారం ఉదయం పాఠశాల తెరిచే సమయంలో రోడ్డుపైనే ఓ విద్యార్థిపై ఆకతాయిలు దాడి చేసి పరారయ్యారు. ఈ పరిణామాలతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ప్రాఠశాల వద్ద ఎటువంటి రక్షణ లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడెక్కడినుంచో ఆకతాయిలు వచ్చి వికృత చేష్టలకు పాల్పడుతున్నారంటున్నారు.వీరి ఆగడాలకు చెక్ పెట్టేందుకు పోలీసులు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం సమయాల్లో గస్తీ తిరగాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

చురుగ్గా ఇసుక కొండ సత్యదేవుని ఘాట్ రోడ్డు నిర్మాణం

పూర్ణామార్కెట్, మార్చి 5: వన్‌టౌన్‌లోని ఇసుక కొండ సత్యనారాయణ స్వామి ఆలయ ఘాట్ రోడ్డు నిర్మాణపనులు శరవేగంగా జరుగుతున్నాయి. పూర్ణామార్కెట్ రోడ్డు మార్గం నుంచి ఈ ఘాట్ నిర్మాణాన్ని జీవీఎంసీ రూ. 11 కోట్ల వ్యయంతో చేపడుతోంది. ఈపనుల్లో తొలుతలో ఇబ్బందులు తలెత్తడంతో కమిషనర్ శ్రీకాంత్ వర్మ ప్రత్యేక చొరవ తీసుకోవడంతో ఆలయం వద్ద విస్తరణ పనులు ఊపందుకున్నాయి. ఎన్నికల కోడ్‌కు ముందుగానే పనులు పూర్తి చేసి ప్రారంభించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నట్లు సమాచారం.

సీఎం నోట అదే పాట

... 3వ పేజీ తరువాయి

వారు రాసుకోండి' అంటూ ప్రకటించారు.

» ప్రస్తుతం ఉత్తరాంధ్ర వైసీపీ ఇన్‌చార్జిగా ఉన్న వైవీ సుబ్బారెడ్డి అనేక సందర్భాల్లో సీఎం జగన్ 2023లో దసరాకు వస్తారని కొన్నిసార్లు, దీపావళి వెళ్లాక వస్తారని ప్రకటించారు. 2024 సంక్రాంతికి వస్తారని ప్రచారం చేశారు. ఇప్పుడు కూడా అదిగో వస్తారు.. ఇదిగో వస్తారని అంటున్నారు.

విశాఖపట్నం రావడానికి ఈ ప్రచారం దేనికి?, వచ్చేయవచ్చుగా. ఎవరు అడ్డం పడ్డారు?, ఎందుకు రావడం లేదు? రాకుండా ఎందుకు ఈ ప్రచారాలు?

న్యాయ స్థానాల్లో కేసులు ఉన్నంత వరకూ రాజధాని మార్చడానికి వీల్లేదు. సీఎంగా ఎక్కడి నుంచైనా పరిపాలన చేయవచ్చు. కానీ వందలాది మంది అధికారులు, సిబ్బందిని వెంటేసుకుని వచ్చి, ప్రత్యేక కార్యాలయాలు అంటేనే న్యాయస్థానం ఒప్పుకోలేదు. ఆ విషయం చెప్పకుండా...అడ్డం పడుతున్నారనే ఆరోపణలు దేనికో మరి. ఇక త్వరలో జరగనున్న ఎన్నికల్లో రాజకీయంగా లబ్ధి పొందేందుకే సీఎం తాజాగా విశాఖకు వచ్చేస్తాననే మరోమారు ప్రకటన చేసి ఉంటారనే అభిప్రాయం వినిపిస్తోంది.

దుకాణాలు బంద్

... 3వ పేజీ తరువాయి

అనుమతించడం కనిపిం చింది. వారిద్దరూ పాస్‌లు మెడలో వేసుకుని హోటల్ లోకి వెళుతుండగా హోటల్ బయట ఉన్నవారు కొం దరు గుర్తుపట్టి... వారు పారిశ్రామికవేత్తలా?...అంటూ ఆశ్చర్యపోయారు. సదస్సుకు రెండు వేల మంది పారిశ్రామికవేత్తలు హాజరవుతున్నారని అధికారులు ప్రకటించగా, వారిలో సగం మంది వీరే ఉన్నట్టున్నారనే వ్యాఖ్యలు వినిపించాయి.దీనికి బలం చేకూర్చేలా కొంతమంది మహిళలు డెలిగేట్ పాస్‌లు చేతిలో పట్టుకుని హోటల్ బయట వేచి ఉంటే...వారి దగ్గరకు రాజకీయ నాయకుల అనుచరులు వచ్చి పాస్ రాయించుకుని లోపలకు వెళ్లారు.

డెలిగేట్లుగా సచివాలయ సిబ్బంది

... 3వ పేజీ తరువాయి

పిలుపునిచ్చారు. ఏపీఐఐసీ అధికారులు, కలెక్టర్ కార్యాలయంలోని అధికారులు నగర పారిశ్రామికవేత్తలకు ఫోన్లు చేసి మరీ ఆహ్వానించారు. ఒక్కొక్కరికి మూడుసార్లు ఫోన్లు చేశారు. కన్‌ఫర్మ్ చేయాలని పదేపదే కోరారు. చాలామంది తాము రావడం లేదని చెబితే, కారణం ఏమిటి?, అంటూ అధికారులు ఎదురు ప్రశ్నించారు. కొందరు ఆరోగ్యం బాగా లేదని, ఊళ్లో లేమని చెప్పారు. మరికొందరు...ఏ కారణమో ఎందుకు చెప్పాలి?...ఎదురు ప్రశ్నించారు. తాము ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వాలని, అందుకే కారణాలు అడుగుతున్నామంటూ ఫోన్లు చేసిన వారు వాపోయారు. ఈ సమావేశానికి విశాఖలో సగం మంది పారిశ్రామికవేత్తలు హాజరుకాలేదు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ప్రొఫెసర్లు అంతా సూట్లు వేసుకొని సమావేశానికి వెళ్లాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో పదుల సంఖ్యలో హాజరయ్యారు. రెండు వేల మందికి ఏర్పాట్లు చేయగా సగం సీట్లు ఖాళీగా ఉండిపోవడంతో సచివాలయాల సిబ్బందిని పంపించారు. వారికి పాస్‌లు అందించే బాధ్యతను మధురవాడ సచివాలయ సిబ్బందికి అప్పగించారు. దాంతో వారు హోటల్ బయట ప్రహరీ దగ్గరే ఉండి, వచ్చిన వారికి పాస్‌లు ఇచ్చి లోపలకు పంపించారు. అలాగే కేటరింగ్‌లు నడిపేవారిని,పర్యాటకులకు కార్లు అద్దెకు ఇచ్చేవారిని, రియల్ ఎస్టేట్‌లో ప్లాట్లు విక్రయించే వారిని తీసుకువచ్చి సీట్లు నింపేశారు. ముందు వరుసల్లో మంత్రులు, అధికారులు కూర్చొని, ఆ తరువాత సూట్లు వేసుకున్న అధికారులు, పారిశ్రామికవేత్తలను కూర్చోబెట్టి...ఆ తరువాత అంతా ఎక్కడెక్కడి నుంచో తీసుకువచ్చిన వారిని కూర్చోబెట్టారు.

కేంద్రం నిధులు దారిమళ్లింపు

... 3వ పేజీ తరువాయి

చేపట్టారు. ఇందులో ఇప్పటివరకు రూ.30 కోట్ల బిల్లులు చెల్లించిన ప్రభుత్వం..మరో రూ.120 కోట్లు పెండింగ్‌లో పెట్టింది. అదేవిధంగా నాబార్డ్ అందించిన నిధులతో చేసిన పనులకు సుమారు రూ.20 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. నక్సలైట్ల ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేకంగా రోడ్లు, మౌలిక సదుపాయాలు కోసం కేంద్రం నిధులు మంజూరుచేస్తుంది. ఈ మేరకు ఏజెన్సీ ప్రాంతాల్లో కొన్ని పనులు చేశారు. వీటికి సంబంధించిన బిల్లులను కొందరు కాంట్రాక్టర్లకు చెల్లించాల్సి ఉన్నట్టు చెబుతున్నారు. వీటితోపాటు రాష్ట్ర ప్రభుత్వం గడిచిన నాలుగు నెలల నుంచి అనేక ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణాలు, విస్తరణ పనులు చేయిస్తోంది. ఈ పనులు చేసిన కాంట్రాక్టర్లకు సుమారు రూ.100 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. మొత్తం ఉమ్మడి జిల్లాలో రోడ్లు, భవనాల శాఖ పరిధిలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు రూ.400 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నిధులను రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఎప్పుడో అందించింది. అయితే వైసీపీ ప్రభుత్వం ఇతర పథకాలకు మళ్లించేసింది. బిల్లులు విడుదల కాకపోవడంతో కొందరు కాంట్రాక్టర్లు పనులను పూర్తిగా నిలిపివేశారు.

ఉక్కు కాంట్రాక్టు కార్మికుల పోరుబాట

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 5: స్టీల్‌ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులు పోరాటాలకు సిద్ధమవుతున్నారు. ఉక్కు కార్మికుల ప్రధాన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘ నాయకులు గతంలో యాజమాన్యంతో చర్చించారు. ఆ చర్చలు విఫలమవ్వడంతో సమ్మె కూడా చేశారు. అయితే అప్పట్లో ఉక్కు యాజమాన్యం ఇచ్చిన హామీ మేరకు సమ్మె విరమించారు. కానీ ఇప్పటివరకు సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు ఆరోపిస్తున్నారు కార్మిక సమస్యలపై యాజమాన్యం ముందుకు రాకపోతే ఉద్యమాలను తీవ్రతరం చేస్తామన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో సుమారు 13 వేల మంది కాంట్రాక్టు కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వారి సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు పోరాటాలను ఆపేది లేదని నాయకులు హెచ్చరిస్తున్నారు.

ఇచ్చిన హామీని స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం విస్మరించిందని ఆవేదన

ప్రధాన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్



ఇవీ ప్రధాన సమస్యలు..

- కొవిడ్ లాక్‌డౌన్ కాలంలో కార్మికులకు చెల్లిస్తామన్న వేతనాలను తక్షణమే చెల్లించాలి
- ఎన్‌జేసీఎస్ సమావేశంలో పర్మినెంట్ కార్మికుడికి ఎస్-1 వేతనం అందించాలి. ఇవ్వాలి
- ప్రతి నెల సకాలంలో జీతాలివ్వాలి
- ప్రమాద ఎక్స్‌గ్రేషియాను 30లక్షలు చెల్లించాలి.
- ఎనిమిది గంటల పని దినాలను అమలు చేయాలి.
- ఈఎస్ఐ ద్వారా మెరుగైన వైద్య సేవలందించాలి.
- ప్రమాదం జరిగిన చోట నుంచి ఈఎస్ఐ రిఫర్ చేసిన ఆస్పత్రి వరకు అంబులెన్స్ సౌకర్యం కల్పించాలి.
- కార్మికుల నైపుణ్యతను బట్టి డిజిగ్నేషన్‌లలో మార్పులు చేయాలి.
- పెండింగ్‌లో ఉన్న ఫుల్ అండ్ ఫైనల్‌ను యాజమాన్యం చెల్లించాలి.
- ఖాళీ పోస్టులను నిర్వాసితులతో భర్తీ చేయాలి
- కరోనా మృతుల కుటుంబాల్లో ఒకరికి ఉపాధి కల్పించాలి
- గేటు పాసులలో వయస్సు సరిచేయాలి
- మూడు నెలల పాసులు ఇచ్చి, ఆ పాసు ఆధారంగా వాహనాలను అనుమతించాలి
- కాంట్రాక్టు కార్మికులకు భద్రతా పనిముట్లను అందజేయాలి
- కాంట్రాక్టర్ మారినా కార్మికుడు కొనసాగే పద్ధతిని వర్క్ ఆర్డర్‌లో పొందుపరచాలి.

ఇప్పటికైనా యాజమాన్యం స్పందించాలి



కాంట్రాక్టు కార్మికులు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలను పరిష్కరించాలని గతంలో అధికారులకు విన్నవించాం. ఉక్కు ఉత్పత్తిలో కీలకపాత్ర పోషిస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు యాజమాన్యం ముందుకు రాకుంటే ఉద్యమిస్తాం.

-మంత్రి రవి, ఏఐటీయూసీ కాంట్రాక్టు సంఘం ప్రధాన కార్యదర్శి



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న ప్రసాదుల శ్రీనివాస్

జయహో బీసీ సభకు తరలిన టీడీపీ శ్రేణులు

గాజువాక, మార్చి 5: తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం మంగళగిరిలో నిర్వహించిన జయహో బీసీ సభకు గాజువాక నుంచి పలువురు టీడీపీ నాయకులు తరలివెళ్లారు. పాత గాజువాకలో టీడీపీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్ గంధం శ్రీనివాస్ జెండా ఊపి బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ హయాంలోనే బీసీలకు న్యాయం జరిగిందన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీలు అణచివేతకు గురయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొండబాబు, కృష్ణ, అప్పలనాయుడు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు హౌస్ అరెస్టు



గృహ నిర్బంధంలో ఉన్న అనంతలక్ష్మి

అక్కిరెడ్డిపాలెం, మార్చి 5: సీఎం జగన్ మంగళవారం విశాఖ రావడంతో ముందస్తు చర్యల్లో భాగంగా తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మిని గాజువాక పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. మంగళవారం ఉదయం విజయవాడ నుంచి అక్కిరెడ్డిపాలెంలోని తమ ఇంటికి వచ్చిన అనంతలక్ష్మిని అప్పటికే అక్కడ ఉన్న ఇద్దరు పోలీసులు గృహ నిర్బంధం చేస్తున్నట్టు తెలిపారు. తనకు కొన్ని ముఖ్యమైన పనులున్నాయని చెప్పినా బయటకు పంపేందుకు పోలీసులు నిరాకరించారని అనంతలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి విశాఖ వచ్చినప్పుడల్లా ప్రతిపక్ష నాయకులను హౌస్ అరెస్టు చేయడం సిగ్గుచేటని, ఇలాంటి వారికి రానున్న ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు.

పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ముత్యాలు



గాజువాక, మార్చి 5: ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా గాజువాక ప్రాంతానికి చెందిన జెర్రిపోతుల ముత్యాలు నియమితులయ్యారు. కాంగ్రెస్ పార్టీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్తగా ఉన్న తనను రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించడం ఎంతో ఆనందంగా ఉందని ఆయనన్నారు. పార్టీ పటిష్టతకు మరింత కృషి చేస్తానని పేర్కొన్నారు. తనకు ఈ అవకాశం ఇచ్చిన పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డికి, అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి జ్యోతిర్లింగాల ప్రదర్శన

అగనంపూడి, మార్చి 5: మహా శివరాత్రిని పురస్కరించుకుని ప్రజాపిత ఈశ్వరీయ విశ్వవిద్యాలయం బ్రహ్మకుమారీస్ అగనంపూడి శాఖ ఆధ్వర్యంలో బీసీ కాలనీలోని దివ్యజ్యోతి భవన్ వద్ద బుధవారం నుంచి నాలుగు రోజుల పాటు ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రదర్శనను ఏర్పాటు చేసినట్టు నిర్వాహకుడు బీకే రామకోటి తెలిపారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, బ్రహ్మకుమారీస్ సంస్థ జిల్లా ఇన్‌చార్జి బీకే వేణి ముఖ్యఅతిథులుగా హాజరై ఈ ప్రదర్శనను ప్రారంభిస్తారన్నారు. భక్తులందరూ ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శించి, తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని ఆయన కోరారు.



ప్రచారంలో పాల్గొన్న గణబాబు, శ్రీభరత్, తదితరులు

89వ వార్డులో గణబాబు ప్రచారం

గోపాలపట్నం, మార్చి 5: తెలుగుదేశం, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థులను ప్రజలు గెలిపించి రాష్ట్రాభివృద్ధికి దోహదపడాలని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు కోరారు. 89వ మంగళవారం సాయంత్రం టీడీపీ విశాఖ పార్లమెంట్ ఇన్‌చార్జి శ్రీభరత్‌తో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమం టీడీపీ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. శ్రీభరత్ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంతోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. అందువల్ల రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన ప్రభుత్వం ఏర్పాటు అందరూ సహకరించాలన్నారు. జనతాకాలనీ, పద్మనాభనగర్, కంచరపాలెం కాలనీల్లో ప్రచారం సాగించారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవార్డులు బాధ్యతలు పెంచుతాయి

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 5: అవార్డులు బాధ్యతలు పెంచుతాయని ఉక్కు తెలంగాణ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, జనరల్ మేనేజర్ ఎన్.వీరేశం అన్నారు. ఇటీవల స్టీల్‌ప్లాంట్ ప్రతిష్టాత్మకమైన జవహర్‌లాల్ నెహ్రూ అవార్డులు పొందిన తెలంగాణ ఉద్యోగులను మంగళవారం సీ-భవన్‌లో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు జి.ఆనంద్, మోహన్‌రావు, నరసింగరావు, శ్రావణ్‌కుమార్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

'నగరాలు రాజకీయంగా ఎదగాలి'

మల్కాపురం, మార్చి 5: రాష్ట్రంలోని నగరాల కులస్తులంతా రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగాలని నగరాల డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాస్ పేర్కొన్నారు. యారాడ గ్రామస్థులు మంగళవారం ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరాల కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కుల పెద్దలు మురుపిల్ల నూకరాజు, ములంపాక అప్పారావు, మజ్జి వెంకటరావు, బి.నాగభూషణం, ఎం.కైలాస్, బి.నాగేశ్వరరావు, డైరెక్టర్లు లలిత, అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ స్థితిగతులపై సీఎంకు మెయిల్ చేశాం

జగన్ ఎన్నిమార్లు విశాఖ వచ్చినా తమ గోడు వినేందుకు సమయం కేటాయించకపోవడం దారుణం

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం, మార్చి 5: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ, కార్మికుల కష్టాలను వివరించేందుకు తమకు అవకాశం కల్పించకపోవడంతో సీఎం జగన్‌కు ఉక్కు చరిత్ర, స్థితిగతులను వివరిస్తూ మెయిల్ చేశామని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 1,118వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడేళ్లుగా పలుమార్లు ముఖ్యమంత్రి విశాఖ వచ్చినా.. ఒకసారి కూడా ఉక్కు కార్మిక సంఘాలకు కలిసేందుకు అవకాశం ఇవ్వకపోవడం దారుణమన్నారు. తమ గోడు వినేందుకు తీరిక లేకపోవడంతో సీఎంకు కార్మికుల కష్టాలను వివరిస్తూ మెయిల్ చేశామన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను అన్ని రాష్ట్రాలు వ్యతిరేకిస్తుంటే జగన్ మాత్రం తమ స్వప్రయోజనాల కోసం మిన్నకుండిపోతున్నారని విమర్శించారు. నాడు విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేస్తామని నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ అంటే అప్పటి సీఎం దివంగత వైఎస్ వ్యతిరేకించారన్నారు. జగన్ మాత్రం ఉక్కు పరిరక్షణ కోసం చిన్న ప్రయత్నం కూడా చేయకపోవడం విచాకరమన్నారు. కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ ఉక్కు కర్మాగారంపై గోడమీద పిల్లి వాటంలా వ్యవహరిస్తున్న రాజకీయ పార్టీలకు రానున్న ఎన్నికల్లో విశాఖ ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఉక్కును ప్రైవేటీకరిస్తే కర్మాగారం కోసం ప్రాణ త్యాగాలు చేసిన వారికి విలువ ఉండదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం వెనక్కి తీసుకునేందుకు తాము వెనక్కి తగ్గేదే లేదన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

మహా శివరాత్రి ఉత్సవాలను పటిష్టంగా నిర్వహించాలి: ఆర్డీవో హుస్సేన్ సాహెబ్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 5: అప్పికొండపై మహా శివరాత్రి ఉత్సవాలను పటిష్టంగా నిర్వహించాలని అధికారులకు ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ ఆదేశించారు. ఈ నెల ఎనిమిదిన మహా శివరాత్రి సందర్భంగా అప్పికొండపై, తీరంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై ఆయన మంగళవారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించి మహా శివరాత్రి ఉత్సవాల్లో ఎక్కడ లోటుపాట్లు లేకుండా చూడాలని ఆర్డీవో సూచించారు. సముద్రం వద్ద గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచుతామన్నారు. పండగ నేపథ్యంలో అధికారులు తమ సిబ్బందిని సమన్వయపరచాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా టాయిలెట్లు, తాగునీరు, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు గాను ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. డీసీపీ ఎం.సత్తిబాబు మాట్లాడుతూ భద్రతాపరంగా చర్యలు చేపడుతున్నామని, భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సిబ్బందిని నియమిస్తున్నామన్నారు. దేవదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శిరీషా మాట్లాడుతూ మహా శివరాత్రి నాడు వేలాది మంది భక్తులు అప్పికొండకు రానున్నందున పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో దేవదాయ ధర్మాదాయ శాఖ ఉత్సవ అధికారి రాజగోపాలరెడ్డి, ఈవో జగన్నాథరావు, కార్పొరేటర్ బట్టు సూర్యమారి, సౌత్ ఏసీపీ త్రినాథ్, సీఐ ఎర్రంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఒకే పనికి రెండుసార్లు శిలాఫలకాలు ఆవిష్కరణ!



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



కొబ్బరికాయ కొట్టి శిలాఫలకాన్ని ఆవిష్కరించిన కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు

వేపగుంట, మార్చి 5: జీవీఎంసీ వేపగుంట జోనల్ కార్యాలయంలో రూ.50 లక్షలతో చేపట్టనున్న భవన పునర్నిర్మాణ పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మంగళవారం ఆవిష్కరించారు. అయితే కాసేపయ్యాక అవే పనులకు సంబంధించి కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు వచ్చి కొబ్బరికాయ కొట్టి అదే శిలాఫలకాన్ని ప్రారంభించారు. జీవీఎంసీ నిధులతో ప్రారంభిస్తున్న కార్యక్రమాలకు అధికారులు, నిర్వాహక కమిటీ సభ్యులకు మధ్య సమన్వయం లేకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని కార్పొరేటర్ ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జెడ్సీ కె.హైమావతి, ఈఈ రమణమూర్తి, డీఈ విజయకుమార్, ఏఈ ప్రజ్ఞ, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ భావాన్ని అందరూ అలవరుచుకోవాలి

పెదగంట్యాడ, మార్చి 5: ప్రతి ఒక్కరిలోనూ జాతీయ భావం ఉండాలని, దీనిని విద్యార్థి దశ నుంచే అలవరుచుకోవాలని 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి అన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం నడుపూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాన్ని మంగళవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. చారు. ఈ సందర్భంగా ఆమె ఎన్ఎస్ఎస్ విద్యార్థుల కులమతాలకు అతీతంగా సేవా దృక్పథంతో ముందుకు సాగాలన్నారు. శిబిరంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ క్యాడెట్లకు తాము నిత్యం అందుబాటులో ఉంటామని, ఎటువంటి సహాయం కావాలన్నా తనను సంప్రదించాలన్నారు. ఎన్ఎస్ఎస్ క్యాడెట్లు, కో-ఆర్డినేటర్లు పాల్గొన్న ఈ శిబిరం వారం రోజుల పాటు కొనసాగనున్నది.

కార్మికులకు సత్కారం

అగనంపూడి, మార్చి 5: ఉక్కు కర్మాగారంలో భద్రతా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన కాంట్రాక్టు కార్మికులు బలిరెడ్డి శ్రీను, చట్టి వెంకట అప్పారావు, డీవీఎస్ నరసింగరావులను బుధవారం ఉక్కు అఖిలపక్షం యూనియన్ నేతలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భద్రత గురించి ప్రతి ఒక్కరికీ తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు బి.సత్యనారాయణ, కె.పైడిరాజు, సన్యాసిరావు, బి.అప్పారావు, నీలకంఠం, తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాపాయ స్థితిలో ఉన్న మహిళ ఆస్పత్రికి తరలింపు

మల్కాపురం, మార్చి 5: హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు వద్ద ప్రాణపాయ స్థితలో ఉన్న ఓ మహిళను సామాజిక కార్యకర్త చెల్లూరి భాస్కర్ పోలీసుల సహకారంతో చికిత్స నిమిత్తం కేజీహెచ్‌లో చేర్పించారు. విజయవాడ ప్రాంతానికి చెందిన దేవినేని ఉమ (30)గా ఆమెను గుర్తించారు. ఆమె ఇక్కడకు ఎలా వచ్చిందో, ఎప్పుడు వచ్చిందో తెలియదు గానీ మూడు రోజులుగా హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు వద్ద ఉంది. ఆమెను గమనించిన భాస్కర్ మల్కాపురం పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆమెను పేషంట్‌గా పోలీసులు గుర్తించారు. ఆస్పత్రిని నుంచి ఆమెను ఎవరైనా బయటకు తీసుకువచ్చి ఇక్కడ వదిలేశారా, లేక ఆమే ఆస్పత్రి నుంచి వచ్చేసిందా అన్న విషయాలు తెలియాల్సి ఉంది. కేజీహెచ్‌లో ఆమె గురించి వైద్యులు ఆరా తీయగా... ఆమె భర్త, పిల్లల వివరాలు తెలపడంతో పాటు భర్త ఫోన్ నంబర్‌ను ఇచ్చింది. దీంతో పోలీసులు ఆ నంబర్‌కు కాల్ చేసి ఆమె భర్తను రప్పించారు. తాము జాతరల్లో బుట్టలు, తదితర సామగ్రిని విక్రయిస్తూ జీవనం సాగిస్తుంటామని, ఉమ కోసం తాము వెతుకుతున్నామని తెలిపారు. ప్రస్తుతం ఆమె కేజీహెచ్‌లో చికిత్స పొందుతుంది.

'శ్రామిక మహిళలు పోరాట ధీరులు'

పెందుర్తి, మార్చి 5: శ్రామిక మహిళలు పోరాట ధీరులని పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు వెంకటలక్ష్మి అన్నారు. చినముషిడివాడ అంబేడ్కర్ నగర్‌లో ఉన్న పీవోడబ్ల్యూ కార్యాలయంలో మంగళవారం అంతర్జాతీయ శ్రామిక పోరాట మహిళా దినోత్సవం సందర్భంగా కమిటీ సభ్యులు కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యు జిల్లా కార్యదర్శి ఇందిర, అరుణోదయ నాట్యమండలి ప్రతినిధి నిర్మల, పీవోడబ్ల్యూ జిల్లా ప్రతినిధులు రూప, గీత, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

హక్కుల రక్షణకు పోరాటాలే శరణ్యం

గాజువాక, మార్చి 1: హక్కుల రక్షణకు పోరాటాలే శరణ్యమని హైకోర్టు హక్కుల న్యాయవాది పిచ్చుక శ్రీనివాసరావు అన్నారు. విదసం ఐక్య వేదిక, ఉక్కు నిర్వాసితుల సంఘం, యూనియన్ ఆఫ్ స్టీల్ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో గాజువాకలో మంగళవారం హేతువాది తుంపాల శ్రీరామ్మూర్తి ఆరు దశాబ్దాల పోరాటాల ప్రస్తావన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకులు హక్కులను కాలరాస్తుంటే వాటిపై పోరాడి రాజ్యాంగ ఉల్లంఘనలను ప్రజలు, న్యాయస్థానాల దృష్టికి తీసుకువెళ్లడంలో శ్రీరామ్మూర్తి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అనంతరం శ్రీరామ్మూర్తిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు బూసి వెంకటరావు, బస సాధూరెడ్డి, వెంకటరమణ, పరమేశ్వరి, భాస్కర్, యేల్లేటి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 5: క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని స్టీల్‌ప్లాంట్ జీఎం (హెచ్ఆర్) కె.సంజీవరావు అన్నారు. అరబిందో స్కూల్ వార్షిక క్రీడోత్సవాలను మంగళవారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాలలో రాణించాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు విద్య, ఉపాధి అవకాశాలు అధికంగా ఉంటాయన్నారు. ఈ సందర్భంగా పలు క్రీడల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ వి.రామారావు, ప్రిన్సిపాల్ వై.ఈశ్వరరావు, తదితరులు సిబ్బంది పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **చారి 111 :** వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక).
- **భూతద్దం భాస్కరనారాయణ :** శారద, శరత్, ఊర్వశి (కంచరపాలెం) సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), నటరాజ్ (పెందుర్తి).
- **ఇంటి నెం.13 :** లీలామహల్.
- **మా ఊరి రాజారెడ్డి :** క్రాంతి
- **రాధా మాధవం :** మౌర్య (గోపాలపట్నం)
- **భ్రమయుగం :** జగదాంబ, హెవెన్ (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **సుందరం మాస్టర్ :** శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సప్తగిరి (తగరపువలస)
- **సిద్దార్థ్ రాయ్ :** శ్రీరామ, శ్రీకన్య, మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **ఊరు పేరు భైరవకోన :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్ ఊర్వశి, నరసింహ (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ఈగల్ :** రమాదేవి,
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 25, టమాటా 17, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 44, బెండకాయలు 30, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 44, బీరకాయలు 38, ఆనపకాయ 15, కాలీఫ్లవర్ 24, క్యాబేజీ 20, క్యారెట్ 24, దొండకాయలు 26, బంగాళదుంపలు 20, అరటికాయ (పెద్దది) 7, అల్లం (పాతది) 110, మునక్కాడలు (కిలో) 55, బరబాటి 15, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 32, దోసకాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 150, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 44, ఆగాకర 52, పొటల్స్ 62, కీర దోస 30, క్యాప్సికమ్ 52, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 52, చిలగడదుంపలు 24, కంద 64, దేముడుచిక్కుడు 56, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు

బ్యాగ్		
రైతు ధర	--	112
ఫారం ధర	--	132
విత్ స్కిన్	--	234
స్కిన్‌లెస్	--	244

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 8లో..

'ప్రజాదర్బార్'కు స్పందన కరువు



పెదజాలరిపేట వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌లో జనం లేని దృశ్యం

జగదాంబ కూడలి, మార్చి 5: దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌కు ప్రజలనుంచి స్పందన కరవవుతోంది. మంగళవారం గ్రేటర్ 30వ వార్డులో మూడు వార్డులకు సంబంధించి ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్ వద్దకు సమస్యలను వివరించడానికి స్థానికులు ఎవరూ పెద్దగా రాలేదు. ఎమ్మెల్యే కూడా లేకపోవడంతో ఆయన పీఏ, వైసీపీ వార్డు నాయకులు వచ్చిన వారిని వినతులుస్వీకరించి మమ అనిపించారు. కొన్నాళ్లుగా ఎమ్మెల్యే వాసుపల్లి వారంలో మూడు రోజులు ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్నట్టు ప్రచారం చేసుకుంటున్నారు. కానీ, జనాల్లో మాత్రం ఫిర్యాదులు, వినతులకు పరిష్కారం లభించడంలేదని అసంతృప్తి వ్యక్తమవుతోంది. దీంతో కొద్దిరోజులుగా ప్రజాదర్బార్ అధికార పార్టీ నాయకులు, కార్యకర్తల హంగామాకు పరిమితమవుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పలుమార్లు ఇళ్లు, స్థలాలు, పింఛన్లతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నా పెద్దగా ప్రయోజనంలేకపోవడంతో జనాలు ప్రజాదర్బార్‌కు వచ్చే వారి సంఖ్య క్రమేపీ తగ్గిపోతోందన్న మాట వినిపిస్తోంది. ఎమ్మెల్యే వాసుపల్లి స్వయంగా అర్జీలు స్వీకరించినా ఫలితం కానరావడంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్నికల ముందు ప్రజాదర్బార్‌కు స్పందన కొరవడంపై రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.

7న దాసి సినిమా ఉచిత ప్రదర్శన

డాబాగార్డెన్స్, మార్చి 5: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 7న విశాఖ పౌరగ్రంథాయలంలో దాసి సినిమా ఉచితంగా ప్రదర్శించనున్నట్టు వీఎఫ్ఎస్ కార్యదర్శి ప్రకాశరావు తెలిపారు. బి.నర్సింగరావు దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం పలు జాతీయ అవార్డులు పొందిందన్నారు. సీనియర్ రంగస్థల నటి దూసి అనురాధను సత్కరిస్తామన్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'తూర్పు కాపులకు అధిక అసెంబ్లీ టికెట్లు కేటాయించాలి'

డాబాగార్డెన్స్, మార్చి 5: రానున్న ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీలు ఉత్తరాంధ్రలో తూర్పు కాపులకు తగినన్ని అసెంబ్లీ టికెట్లు కేటాయించాలని ఏపీ తూర్పు కాపు సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మజ్జి అప్పారావు కోరారు. మంగళవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భీమిలిలో తూర్పుకాపులు ఎక్కువ మంది ఉన్న నేపథ్యంలో ప్రధాన పార్టీలన్నీ అక్కడ తమసామాజిక వర్గానికి టికెట్ కేటాయించాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి మంత్రి వెంకట రమణమూర్తి మాట్లాడుతూ రాజకీయపార్టీలు తమ వైఖరిమార్చుకోవాలన్నారు. తూర్పుకాపులంతా రాజకీయంగా బలోపేతం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర నాయకుడు కేవీల్ నాయుడు మాట్లాడుతూ తుర్పుకాపులకు తగిన టికెట్లు కేటాయించకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.


మురళీనగర్ పార్కు నిర్వహణ భేష్



గాంధీ విగ్రహం ఎదుట సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

మాధవధార, ఫిబ్రవరి 5; గ్రేటర్ 50వ వార్డు పరిధి మురళీనగర్‌లో వైశాఖీ స్పోర్ట్సు పార్కు (స్కేటింగ్ పార్కు)ని మంగళవారం ఉదయం సీబీఐ మాజీ జేడీ వి.వి. లక్ష్మీనారాయణ సందర్శించారు. నగరంలో నివాసం ఉంటున్న ఆయన ఇక్కడి ఈ పార్కుని ఎప్పటినుంచో సందర్శించాలనే కోరిక మేరకు వచ్చినట్టు ఆయన తెలిపారు. పార్కు నిర్వహణ కమిటీ అధ్యక్షులు సనపల. వరప్రసాద్, కార్యదర్శి పి.వి.ఎస్.ఎన్.రాజు ఆయనకు తొలుత స్వాగతం పలికారు. అనంతరం లక్ష్మీనారాయణ పార్కులో గాంధీ స్మారక విగ్రహం, స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ సహా ఇటీవలే ఏర్పాటు చేసిన బుద్ధుని విగ్రహాలను సందర్శించి నిర్వహణ కమిటీని ఈ సందర్భంగా అభినందించారు. పార్కు ప్రతినిధులు ఆయనను మర్యాదపూర్వకంగా సత్కరించారు. రాజకీయ చర్చలకు అతీతంగా ఈ పర్యటన సాగినట్లు పార్కు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

'మహిళలు స్వతంత్రంగా ఎదగాలి'



మాట్లాడుతున్న శ్యామలదీపిక

మురళీనగర్, మార్చి 5; మాదవధార మహిళా వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం మురళీనగర్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో అధ్యక్షురాలు ఎస్.లలితారెడ్డి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్ ఎలెక్టెడ్ ప్రెసిడెంట్ ఎం.ప్రభావతి ముఖ్యఅతిథిగా హాజరై మహిళా సాధికారతపై మాట్లాడారు. గౌరవ అతిథిగా పాల్గొన్న ఉత్తర నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు కుమార్తె శ్యామలదీపిక మహిళా దినోత్సవం ప్రత్యేకతతో పాటు, సమాజంలో మహిళల పాత్రను వివరించారు. మహిళలు స్వతంత్రంగా ఎదగాలని అన్నారు. కార్యక్రమంలో నగల దుకాణం భీమాస్, శ్రీరామ్ ఇన్సురెన్స్ కంపెనీలు అందించిన సాయంతో మహిళలకు బహుమతులు అందించారు. మధ్యాహ్నం భోజనాలు చేశారు. అనంతరం వంటల పోటీలు, జల్దీఫైవ్ నిర్వహించి విజేతలకు బహుమతులిచ్చారు. క్లబ్ సెక్రెటరీ సి.హెచ్.లక్ష్మి, కోశాధికారి పి.కమల, కమిటీ సభ్యులు ఉన్నారు. వనితా వాకర్స్ క్లబ్‌లో ఈనెల 7వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు అధ్యక్షురాలు పి.ప్రభావతి తెలిపారు.



రంగులతో ధగధగలాడుతున్న వంతెన



మరోవైపు గతుకులమయంగా ఫ్లైఓవర్ రోడ్డు

రంగులు సరే...రోడ్లు మాటేమిటి?

» కంచరపాలెం వంతెనకు రంగులు » ఫుట్‌పాత్‌లపై మొక్కల కుండీలతో ముస్తాబు » రోడ్డు మాత్రం అధ్వానం » రాకపోకలకు అవస్థలు

జ్ఞానాపురం, మార్చి 5 ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రభుత్వం ప్రచారానికి పెద్దపీట వేస్తోంది. అభివృద్ధి పనులు తక్కువగా చేపట్టినా వీటితో ప్రజల్లో ప్రయోజనం పొందేందుకు ఆసక్తి చూపుతున్నట్టు కనిపిస్తోంది. నగరంలో ఎక్కడచూసినా ఫుట్‌పాత్‌లు, గోడలకు రంగులు వేసి ముస్తాబు చేస్తున్నారు. ఈ కోవలో జ్ఞానాపురం-కంచరపాలెం నేతాజీ వంతెనను పూర్తిగా రంగులతో ముస్తాబు చేశారు. అంతవరకు బాగానే ఉన్నా, నిత్యం వాహనాల రద్దీ ఉండే రహదారులను మాత్రం పట్టించుకోవడంలేదు. దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కంచరపాలెం నుంచి జ్ఞానాపురం వరకు ఇరువైపులా ఈ వంతెన రోడ్లు గతుకులతోఅధ్వానంగామారడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నా ఇవేవీ ఏమాత్రం పట్టించుకోకుండా రూ.లక్షలు ఖర్చుపెట్టి ఫుట్‌పాత్‌లకు టైల్స్, రంగులు వేశారు. ఇటీవల డివైడర్లపై మొక్కల



రహదారి మధ్యలో పెచ్చులూడిన దృశ్యం

కుండీలు విరిగిపోవడంతోపత్రికల్లో కథనాలు రావడంతో ఉద్యాన వనశాఖ అధికారులు కొత్త కుండీలు,మొక్కలు ఏర్పాటు చేశారు. వేసి రెండు నెలలు పూర్తి కాకుండానే వాటిని పూర్తిగా తొలగించి మళ్లీ రూ. వేలకు వేలు డబ్బు వెచ్చించి ఇటీవల మళ్లీ కొత్త మొక్కలు, కుండీలు ఏర్పాటు చేశారు. వాటి పరిరక్షణను మాత్రం పట్టించుకోవడంలేదు. ప్రజాధనాన్ని ఇలా, జీవీఎంసీ అధికారులు ఎందుకు మట్టిపాలు చేస్తున్నారా? లేక గుత్తేదారుల మేలుకోసమే ఇలాంటి నిర్ణయాలుతీసుకుంటున్నారో అర్థంకావడంలేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. వంతెనపై రోడ్డు అధ్వాన స్థితిపైన ఫిర్యాదులు రావడంతో రెండు నెలల క్రితం అప్పటి కంచరపాలెంట్రాఫిక్ సీఐ చొరవతో మరమ్మతులు చేపట్టారు. రెండు రోజులపాటు ఒకవైపు రహదారిని మూసి మరీ ఈ పనులు పూర్తి చేశారు. అలాగే, ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపంతో గుత్తేదారు తూతూ మంత్రంగా ఈ వంతెన పనులు చేపట్టిన నెలరోజులకే గోతులు పడ్డాయి. ఇప్పుడు రూ. లక్షలు ఖర్చుచేసి ఇరువైపులా ముస్తాబు చేశారు. కానీ,రహదారి జోలికి మాత్రం అధికారులు పోలేదు. ఇబ్బందులు లేకుండా రోడ్లు నిర్మించాలని, ఇలా పైపై మెరుగులు వద్దని వాహనదారులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

సాహితీ రంగంలో అచ్యుత రామరాజుది ప్రత్యేక ముద్ర

» శత జయంతి ఉత్సవంలో సాహితీవేత్తలు



మాట్లాడుతున్న రచయిత బీవీ అప్పారావు

సీతంపేట, మార్చి 5: కళా ప్రపూర్ణ డాక్టర్ గణపతిరాజు అచ్యుత రామరాజు సాహితీ, సంస్కృతిక రంగాల్లో ఐదు దశాబ్దాలపాటు నగరంలో విశేష సేవలందించి ప్రత్యేక ముద్రవేశారని పలువురు వక్తలు కొనియాడారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో కళా ప్రపూర్ణ గణపతిరాజు అచ్యుత రామరాజు స్మారక సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో అచ్యుత రామరాజు శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు పెన్మత్స లలితా వాశిష్ట అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథులుగా విచ్చేసిన నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య బాలమోహన్‌దాస్, బీవీ అప్పారావు మాట్లాడుతూ విశాఖలో అచ్యుత రామరాజు సాహితీ రంగంలో అనేక మందితో కలిసిపనిచేశారన్నారు. నాటకాలు, కథలు రచించారన్నారు. నటుడిగా, వక్తగా రాణించారన్నారు. కళాప్రపూర్ణ గణపతిరాజు అచ్యుత రామరాజు శతజయంతి సంచిక, రచయిత పెన్మెత్స లలితావాశిష్ట రచించిన చిరుజల్లు కథల సంపుటిని ఆవిష్కరించారు. సెంచూరియన్ విశ్వవిద్యాలయం గౌరవ కులపతి ఆచార్య జీఎస్ఎన్ రాజు, ప్రముఖ కవి, కథా రచయిత భాగవతుల కృష్ణారావు, ప్రముఖ రంగస్థల నటులు డాక్టర్ మీగడ రామలింగ స్వామి, రచయిత, వ్యాసకర్త డాక్టర్ దామెర వెంకట సూర్యారావు, కథా రచయిత మల్లాప్రగడ రామారావు, రంగస్థల నటులు భళ్లమూడి రామ్మూర్తి, ఇంజనీరు, సినీనటులు పెన్మెత్స జగన్నాథరాజు, సత్యవాడ సోదరీమణులు రఘునాథమ్మ, సూర్యకుమారి, న్యాయవాది దంతూలూరి మీనాక్షి, చిత్రకారుడు డాక్టర్ బుద్ధరాజుసూరజ్‌వర్మలను సంస్థ జీవన సాఫల్య పురస్కారాలతో సన్మాంచారు. ప్రముఖ న్యాయవాది ఎస్ఎస్ఎస్‌వీఆర్ఎం రాజు, ప్రముఖ కథా, నవల రచయిత ద్విబాష్యం రాజేశ్వరరావు, రచయిత ఆదూరి సీతారామూర్తి, మేడామస్తాన్ రెడ్డి, జగన్నాధరాజు తదితరులు పాల్గొన్నారు.

సేవాసదన్‌కు స్టీల్ సామగ్రి వితరణ



వృద్ధులకు కంచాలు, గ్లాసులు అందిస్తున్న సిస్టర్లు

జ్ఞానాపురం, మార్చి 5: స్థానిక సెయింట్ జోసఫ్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ సిస్టర్ డా.డి. విరోనికా ఐదో వర్ధంతి సందర్భంగా జ్ఞానాపురంలోని నిర్మలహృదయ్ సేవాసదన్‌లో ఉన్న వృద్ధులకు స్టీల్ కంచాలు, గ్లాసులను కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ డా. షైజీ సహకారంతో సిబ్బంది వితరణ చేశారు. వాటితో పాటు గ్లూకోజ్ ప్యాకెట్లు, పండ్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో సిస్టర్లు మేరీజైన్, నాన్సీ, హేమ, డాక్టర్ పీకే జయలక్ష్మి, డా.హరిణి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

కంచరపాలెం, మార్చి 5 : చిన్నారులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ అర్బన్ సూపర్‌వైజర్ జ్యోతి పేర్కొన్నారు. స్థానిక రెడ్డికంచరపాలెం, జాషువానగర్ తదితర అంగన్‌వాడీ కేంద్రాలు, ఆర్పీపేట ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. విద్యార్థులతో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాలతో కలిగే నష్టాలు, చట్టాలను ఆమె వివరించారు. కౌమార దశలో వచ్చే ఆరోగ్య సమస్యలు, పోషకాహారం ప్రాధాన్యం అవగాహనకల్పించారు. హెచ్ఎం ఆర్.శ్రీనివాసరావు, అంగన్‌వాడీ కార్యకర్త దేవుడమ్మ పాల్గొన్నారు.

'టీడీపీ, జనసేన కూటమి గెలుపు తథ్యం'



రేసపువానిపాలెంలో ప్రచారం చేపడుతున్న జనసేన నాయకులు

సీతమ్మధార, మార్చి 5: రాష్ట్రంలో పరిపాలన పూర్తిగా ఆగమ్యగోచరంగా మారిందని, ఈస్థితిలో రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీల గెలుపు తథ్యమని జనసేన పార్టీ ఉత్తరనియోజకవర్గం సమన్వయకర్త పసుపులేటి ఉషాకిరణ్ పేర్కొన్నారు. గ్రేటర్ 24వ వార్డు రేసపువానిపాలెంలో పార్టీ వార్డు అధ్యక్షురాలు అమరాపు దుర్గ ఆధ్వర్యంలో జనంలోకి జనసేన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉషాకిరణ్ ఇంటింటికి వెళ్లి ప్రచారం చేపటారు. టీడీపీ, జనసేన పార్టీల మేనిఫెస్టోను అందజేశారు. రానున్న ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు అడబాల లక్ష్మి, మేరుగ నూకరాజు, గోపికల్యాణం, మోసెస్, గోరపల్లి శివ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకపఠనం తప్పనిసరి



చిన్నారులకు పుస్తకాలందిస్తున్న ఎంఈవో సోమేశ్వరరావు

కంచరపాలెం, మార్చి 5: విద్యార్థులు పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించుకోవాలని గోపాలపట్నం మండల విద్యాశాఖాధికారి అంబటి సోమేశ్వరరావు సూచించారు. జీవీఎంసీ ఆర్పీపేట ప్రాథమిక పాఠశాలలో ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ హ్యూమన్ వ్యాల్యూస్ వారు ఏర్పాటు చేసిన లైబ్రరీను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతు నిరంతరం పుస్తక పఠనంతో జ్ఞానంతో పాటు చక్కని క్రమశిక్షణ అలవడుతుందన్నారు. ఉపాధ్యాయిని అరుణకుమారి ఆర్ట్ ఆఫ్ లివింగ్, పుస్తకాలు చదవడంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం టి. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.అనంతర పాఠశాలలో చిన్నారుల చేతుల మీదుగా మొక్కలు నాటించారు.

చెత్త తొలగించరూ..



సీతంపేట కనకమ్మవారి ఆలయం ఎదురుగా పేరుకున్న చెత్త

సీతంపేట, మార్చి 5: గ్రేటర్ విశాఖ 25వ వార్డు సీతంపేట కనకమ్మవారి వీధిలో కనకమ్మవారి ఆలయం ఎదుట చెత్త పెద్ద ఎత్తున పేరుకుపోయింది. దీంతో ఆ ప్రాంతామంతా దుర్గంధం వెదజల్లడంతో పాటు దోమలు వ్యాప్తి చెందుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత శానిటరీ సిబ్బంది స్పందించి చెత్తను తొలగించాలని కోరుతున్నారు.

పదాల కోసం ప్రసవ వేదన అనుభవించాలి

» అప్పుడే మంచి పాట పుడుతుంది

» సినీ కవి సుద్దాల అశోక్ తేజ



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

భీమునిపట్నం (రూరల్) మార్చి 5

'ఒకటే జననం.. ఒకటే మరణం గెలుపు పొందు వరకూ... అలుపులేదు మనకు' అని యువతకు మార్గదర్శం చేసినా, 'నేను సైతం ప్రపంచానికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను.. అని విప్లవం రగిల్చినా.. ఆదివాసీ మహిళ 'నేడు చనిపోయి.. రేపు డప్పునై పుడతాను' అంటూ ఆత్మగౌరవ ప్రతీకను చాటినా ఆయన కలానికే సాధ్యమయింది. మనిషిలోని భావోద్వేగాలను తన కలం ద్వారా ప్రపంచానికి చాటిచెప్పడంలో ప్రత్యేకత సంతరించుకున్న సినీ గీత రచయితగా సుద్దాల అశోక్‌తేజ గుర్తింపు తెచ్చుకున్నారు. భీమిలి కళా సాహితీ సభలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ సినీ పరిశ్రమలో తన ప్రయాణాన్ని గుర్తుచేసుకున్నారు.

సినిమా పాట రాయడం అనుకున్నంత సులభం కాదని పదాల కోసం ప్రసవవేదన పడితేనే మంచి పాట పుడుతుందని సుద్దాల పేర్కొన్నారు.

దాసరి తీసిన ఒసే రాములమ్మ చిత్రంలో రాములమ్మను దొరలు కొడుతున్న సందర్భంలోని నేపథ్య గీతం కోసంఎంతో కష్టపడాల్సి వచ్చిందన్నారు. అర్థరాత్రి రెండుగంటల సమయంలో తడిబట్టలతో పాట రాశానని, ఆత్రేయలోని ఆత్రం, శ్రీశ్రీ ఉద్రేకం పాటలో ఉండాలనే దర్శకుడు దాసరి నారాయణరావు సూచనతో ఈ పాటకు ప్రాణం పోసానని గుర్తుచేసుకున్నారు. 'నేడు చచ్చిపోతున్నాను... రేపు డప్పై పుడతాను.. విప్లవమా వర్ధిల్లుమా..' చెమ్మగిల్లవే రాములమ్మా అనే పల్లవితో ఆ పాట సాగిందన్నారు.

ఆర్ఆర్ఆర్ చిత్రంలో ఒకే ట్యూన్‌తో రెండు పాటలు రాయాల్సి వచ్చిందని, కొమ్మా ఉయ్యాలా అంటూ సాఫీగా ఓ పాట, బ్రిటిష్‌వారు కొమురం భీంను కొట్టే సందర్భంలోని పాట 'కొమురం భీముడో... కొమురం భీముడో.. రగలాలి కొడుకో అంటూ మరో పాటను రాశానన్నారు. ఆ పాటలోని 'పుడమి తల్లికి జన్మ అరణం ఇచ్చా' అనే వాక్యం గొప్పగా ఉంటుందన్నారు.

పాత్రధారులకు అనుగుణంగా పాట

సినిమాలోని నటీనటుల హావభావాలు, బాడీ లాంగ్వేజ్‌కు అనుగుణంగా పాటలు రాస్తేనే విజయవంతమవుతాయని అశోక్‌తేజ తెలిపారు. అల్లు రామలింగయ్య కోసం రాసిన 'ముత్యాలు వస్తావా పాట ఎన్టీఆర్ లాంటి నటుడి కోసం రాస్తే అభాసుపాలవుతామన్నారు. పాత్ర ఔచిత్యం, సందర్భానికి తగినట్టుగా పాట ఉండాలన్నారు.

భార్యను తల్లిగా, చెల్లిగా చూడాలి..

ప్రతి వ్యక్తి తన భార్యలో తల్లిని, చెల్లిని కూడా చూసినప్పుడే స్త్రీల పట్ల గౌరవం పెరుగుతుందని.. ప్రతి వ్యక్తి వెనుక విజయం వెనుక అతని భార్య ఉంటుందని, ఆమెను ముందుగా మెచ్చుకోవాలన్నారు. నాభార్య సహకారంతోనే సినిమా కవిగా నిలదొక్కుకున్నానని, స్ఫూర్తిదాయకమైన పాటలు రాసే అవకాశాలు కొన్నిసార్లు మాత్రమే వస్తాయన్నారు. 'ఒకటే జననం ఒకటే మరణం పాట ఇలానే పుట్టిందన్నారు.

కవులకు ఉత్తరాంధ్ర ప్రసిద్ధి

తెలంగాణతో పాటు ఉత్తరాంధ్ర కూడా పాటలకు పుట్టినిల్లని సుద్దాల వివరించారు. ఈ ప్రాంతంలోనే కొన్ని మాండలీకాలు పుట్టాయన్నారాయన. గురజాడ రాసిన 'దేశమును ప్రేమించుమన్నా' జాతీయ గీతంగా గుర్తింపు సాధించాల్సిన గొప్పదన్నారు. వంగపండు, సుబ్బారావు పాణిగ్రాహి, భూషణం తదితర కళాకారులు ఈ ప్రాంతంలోని వారేనన్నారు. వంగపండు ప్రసాదరావు పాల్గొన్న ఓ కార్యక్రమంలో పండు పండు పండు.. యాపిల్ దానిపేరు అనే పాటను పాడుతూ చివరిలో రైఫిల్ దానిపేరు అని ఆలపించడంతో అభినందనలు వెల్లువెత్తాయని గుర్తు చేసుకున్నారు.

మరిన్ని పాటలు రాయాలి

సినీ పరిశ్రమకు వచ్చి 30 ఏళ్లలో మూడు వేల పాటలు రాసినా తపన తీరలేదని. అన్ని పాటు సంతృప్తి కలిగించినా.. అంతకంటే మంచి పాట రాసే అవకాశం వెతుక్కుంటూ వచ్చిందని సుద్దాల తెలిపారు. కరీంనగర్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న తాను సినీ గీత రచయిత కావడంతోనే భీమునిపట్నం రాగలిగానన్నారు. ప్రాణం పోయేంతవరకు పాటలు రాయాలన్న తపన ఉందన్నారు.

జయహో బీసీ సభలో విశాఖ నేతలు



సభలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పీలా గోవింద తదితరులు

మహారాణిపేట, మార్చి 5:మంగళగిరిలో మంగళవారం నిర్వహించిన జయహో బీసీ సభకు విశాఖకు చెందిన పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు హాజరయ్యారు.పార్టీజిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతోపాటునేతలు పీలా గోవింద్ సత్యనారాయణ,ఫైలా ప్రసాదరావు, తమ్మిన విజయకుమార్, పి. కోటేశ్వరరావు తదితరులు, కార్యకర్తలు ఉన్నారు.

ఉన్నత పాఠశాల ఎదుట ఆకతాయిల బెడద



ఎన్‌జీజీఓస్ పాఠశాల ఎదుట ఆకతాయిల బాతాఖానీ

అక్కయ్యపాలెం, మార్చి 5 : గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల పరిసరాల్లో ఆకతాయిల బెడద అధికంగా ఉంది. పాఠశాల తెరిచినప్పటి నుంచి బైక్‌లతో గేట్ ఎదుట చక్కర్లు కొడుతూ రాకపోకలు సాగించే వాహనచోదకులు, పాదచారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. పాఠశాలకు వచ్చే విద్యార్థినిలతో అనుచితంగా ప్రవర్తిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై ప్రశ్నించే వారిని దుర్భాషలాడుతూ దాడికి దిగుతున్నారు. ఆకతాయి చేష్టలతో విద్యార్థినులు భయాందోళనకు లోనవుతున్నారు. పాఠశాల తెరిచినప్పుడు, ఇంటర్వెల్, మధ్యాహ్నం భో జనం సమయం, సాయంత్రం ఆకతాయిలు గేట్ ఎదుట రోడ్డుపై నిల్చుని విద్యార్థినులద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారు. అలాగే, కొంతమంది విద్యార్థులను దారి కాసి కొడుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సోమవారం ఉదయం పాఠశాల తెరిచే సమయంలో రోడ్డుపైనే ఓ విద్యార్థిపై ఆకతాయిలు దాడి చేసి పరారయ్యారు. ఈ పరిణామాలతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ్ర పాఠశాల వద్ద ఎటువంటి రక్షణ లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడెక్కడినుంచో ఆకతాయిలు వచ్చి వికృత చేష్టలకు పాల్పడుతున్నారంటున్నారు.వీరి ఆగడాలకు చెక్ పెట్టేందుకు పోలీసులు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం సమయాల్లో గస్తీ తిరగాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

చురుగ్గా ఇసుక కొండ సత్యదేవుని ఘాట్ రోడ్డు నిర్మాణం

పూర్ణామార్కెట్, మార్చి 5: వన్‌టౌన్‌లోని ఇసుక కొండ సత్యనారాయణ స్వామి అలయ ఘాట్ రోడ్డు నిర్మాణపనులు శరవేగంగా జరుగుతున్నాయి. పూర్ణామార్కెట్ రోడ్డు మార్గం నుంచి ఈ ఘాట్ నిర్మాణాన్ని జీవీఎంసీ రూ. 11 కోట్ల వ్యయంతో చేపడుతోంది. ఈపనుల్లో తొలుతలో ఇబ్బందులు తలెత్తడంతో కమిషనర్ శ్రీకాంత్ వర్మ ప్రత్యేక చొరవ తీసుకోవడంతో అలయం వద్ద విస్తరణ పనులు ఊపందుకున్నాయి. ఎన్నికల కోడ్‌కు ముందుగానే పనులు పూర్తి చేసి ప్రారంభించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నట్టు సమాచారం.

సీఎం నోట అదే పాట

... 3వ పేజీ తరువాయి

వారు రాసుకోండి' అంటూ ప్రకటించారు.

» ప్రస్తుతం ఉత్తరాంధ్ర వైసీపీ ఇన్‌చార్జిగా ఉన్న వైవీ సుబ్బారెడ్డి అనేక సందర్భాల్లో సీఎం జగన్ 2023లో దసరాకు వస్తారని కొన్నిసార్లు, దీపావళి వెళ్లాక వస్తారని ప్రకటించారు. 2024 సంక్రాంతికి వస్తారని ప్రచారం చేశారు. ఇప్పుడు కూడా అదిగో వస్తారు... ఇదిగో వస్తారని అంటున్నారు.

విశాఖపట్నం రావడానికి ఈ ప్రచారం దేనికి?, వచ్చేయవచ్చుగా. ఎవరు అడ్డం పడ్డారు?, ఎందుకు రావడం లేదు? రాకుండా ఎందుకు ఈ ప్రచారాలు?

న్యాయ స్థానాల్లో కేసులు ఉన్నంత వరకూ రాజధాని మార్చడానికి వీల్లేదు. సీఎంగా ఎక్కడి నుంచైనా పరిపాలన చేయవచ్చు. కానీ వందలాది మంది అధికారులు, సిబ్బందిని వెంటేసుకుని వచ్చి, ప్రత్యేక కార్యాలయాలు అంటేనే న్యాయస్థానం ఒప్పుకోలేదు. ఆ విషయం చెప్పకుండా...అడ్డం పడుతున్నారనే ఆరోపణలు దేనికో మరి. ఇక త్వరలో జరగనున్న ఎన్నికల్లో రాజకీయంగా లబ్ధి పొందేందుకే సీఎం తాజాగా విశాఖకు వచ్చేస్తాననే మరోమారు ప్రకటన చేసి ఉంటారనే అభిప్రాయం వినిపిస్తోంది.

దుకాణాలు బంద్

... 3వ పేజీ తరువాయి

అనుమతించడం కనిపిం చింది. వారిద్దరూ పాస్‌లు మెడలో వేసుకుని హోటల్‌లోకి వెళుతుండగా హోటల్ బయట ఉన్నవారు కొం దరు గుర్తుపట్టి... వారు పారిశ్రామికవేత్తలా?...అంటూ ఆశ్చర్యపోయారు. సదస్సుకు రెండు వేల మంది పారిశ్రామికవేత్తలు హాజరవుతున్నారని అధికారులు ప్రకటించగా, వారిలో సగం మంది వీరే ఉన్నట్టున్నారనే వ్యాఖ్యలు వినిపించాయి.దీనికి బలం చేకూర్చేలా కొంతమంది మహిళలు డెలిగేట్ పాస్‌లు చేతిలో పట్టుకుని హోటల్ బయట వేచి ఉంటే...వారి దగ్గరకు రాజకీయ నాయకుల అనుచరులు వచ్చి పాస్ రాయించుకుని లోపలకు వెళ్లారు.

డెలిగేట్లుగా సచివాలయ సిబ్బంది

... 3వ పేజీ తరువాయి

పిలుపునిచ్చారు. ఏపీఐఐసీ అధికారులు, కలెక్టర్ కార్యాలయంలోని అధికారులు నగర పారిశ్రామికవేత్తలకు ఫోన్లు చేసి మరీ ఆహ్వానించారు. ఒక్కొక్కరికి మూడుసార్లు ఫోన్లు చేశారు. కన్‌ఫర్మ్ చేయాలని పదేపదే కోరారు. చాలామంది తాము రావడం లేదని చెబితే, కారణం ఏమిటి?, అంటూ అధికారులు ఎదురు ప్రశ్నించారు. కొందరు ఆరోగ్యం బాగా లేదని, ఊళ్లో లేమని చెప్పారు. మరికొందరు...ఏ కారణమో ఎందుకు చెప్పాలి?...ఎదురు ప్రశ్నించారు. తాము ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వాలని, అందుకే కారణాలు అడుగుతున్నామంటూ ఫోన్లు చేసిన వారు వాపోయారు. ఈ సమావేశానికి విశాఖలో సగం మంది పారిశ్రామికవేత్తలు హాజరుకాలేదు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ప్రొఫెసర్లు అంతా సూట్లు వేసుకొని సమావేశానికి వెళ్లాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో పదుల సంఖ్యలో హాజరయ్యారు. రెండు వేల మందికి ఏర్పాట్లు చేయగా సగం సీట్లు ఖాళీగా ఉండిపోవడంతో సచివాలయాల సిబ్బందిని పంపించారు. వారికి పాస్‌లు అందించే బాధ్యతను మధురవాడ సచివాలయ సిబ్బందికి అప్పగించారు. దాంతో వారు హోటల్ బయట ప్రహరీ దగ్గరే ఉండి, వచ్చిన వారికి పాస్‌లు ఇచ్చి లోపలకు పంపించారు. అలాగే కేటరింగ్‌లు నడిపేవారిని,పర్యాటకులకు కార్లు అద్దెకు ఇచ్చేవారిని, రియల్ ఎస్టేట్‌లో ప్లాట్లు విక్రయించే వారిని తీసుకువచ్చి సీట్లు నింపేశారు. ముందు వరుసల్లో మంత్రులు, అధికారులు కూర్చొని, ఆ తరువాత సూట్లు వేసుకున్న అధికారులు, పారిశ్రామికవేత్తలను కూర్చోబెట్టి...ఆ తరువాత అంతా ఎక్కడెక్కడి నుంచో తీసుకువచ్చిన వారిని కూర్చోబెట్టారు.

కేంద్రం నిధులు దారిమళ్లింపు

... 3వ పేజీ తరువాయి

చేపట్టారు. ఇందులో ఇప్పటివరకు రూ.30 కోట్ల బిల్లులు చెల్లించిన ప్రభుత్వం..మరో రూ.120 కోట్లు పెండింగ్‌లో పెట్టింది. అదేవిధంగా నాబార్డ్ అందించిన నిధులతో చేసిన పనులకు సుమారు రూ.20 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. నక్సలైట్ల ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేకంగా రోడ్లు, మౌలిక సదుపాయాల కోసం కేంద్రం నిధులు మంజూరుచేస్తుంది. ఈ మేరకు ఏజెన్సీ ప్రాంతాల్లో కొన్ని పనులు చేశారు. వీటికి సంబంధించిన బిల్లులను కొందరు కాంట్రాక్టర్లకు చెల్లించాల్సి ఉన్నట్టు చెబుతున్నారు. వీటితోపాటు రాష్ట్ర ప్రభుత్వం గడిచిన నాలుగు నెలల నుంచి అనేక ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణాలు, విస్తరణ పనులు చేయిస్తోంది. ఈ పనులు చేసిన కాంట్రాక్టర్లకు సుమారు రూ.100 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. మొత్తం ఉమ్మడి జిల్లాలో రోడ్లు, భవనాల శాఖ పరిధిలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు రూ.400 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నిధులను రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఎప్పుడో అందించింది. అయితే వైసీపీ ప్రభుత్వం ఇతర పథకాలకు మళ్లించేసింది. బిల్లులు విడుదల కాకపోవడంతో కొందరు కాంట్రాక్టర్లు పనులను పూర్తిగా నిలిపివేశారు.

నేత్రపర్వంగా అప్పన్న కల్యాణం



తలంబ్రాలు చూపిస్తున్న అర్చకస్వాములు

సింహాచలం, మార్చి 5: వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్యకల్యాణోత్సవం మంగళవారం నేత్రపర్వంగా సాగింది. సుప్రభాతసేవతో స్వామిని మేల్కొలిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని భూదేవి, నీలాదేవి సమేతంగా ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలుచేసి షోడశోపచారాలు సమర్పించారు. కంకణధారణ, యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్రా బెల్లం, మాంగళ్యధారణలు చేసి అక్షితారోపణ జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత ప్రసాదాలు అందజేశారు.

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

భీమునిపట్నం, మార్చి 5: భీమిలి బోయవీధి సామాజిక భవనంలో సకల్య స్వచ్ఛంద సంస్థ ఏర్పాటుచేసిన ఉచిత టైలరింగ్ కేంద్రాన్ని గ్రామస్థులు కాసరపు దుర్గారావు, కొక్కిరి కాశీడు, అరసవిల్లి పోలిరాజు, చింతల ఎల్లయ్య మంగళవారం ప్రారంభించారు. సంస్థ ప్రతినిధులు సిస్టర్ మాటిల్డ్ మాట్లాడుతూ మహిళలకు ఉచితంగా టైలరింగ్‌లో శిక్షణ అనంతరం సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. సిస్టర్ షకీల, జ్యోతి, పాల్గొన్నారు.

'పాశర్ల రాజీనామాను ఆమోదించొద్దు'



శ్రీభరత్‌తో 98వవార్డు టీడీపీ నేతలు

సింహాచలం, మార్చి 5: నాలుగుదశాబ్దాలకు పైగా తెలుగుదేశం పార్టీలో పనిచేసిన పాశర్ల ప్రసాద్ చేసిన రాజీనామాను ఆమోదించవద్దని పలువురు నాయకులు శ్రీభరత్‌ను కలిసి విన్నవించారు. ఎన్నికల సమయంలో పాశర్ల సేవలు పార్టీకి అవసరమని వివరించారు. తాత్కాలిక ఆవేశంతో తీసుకున్న నిర్ణయంగా పరిగణించాలని కోరారు. శ్రీభరత్‌ను కలిసిన వారిలో సతివాడ శంకరరావు, పైడిరాజు, తరుణ్ ఆదిత్య, బూత్ ఇన్‌చార్జులు ఉన్నారు.

విద్యార్థినుల హాస్టల్ భవనం ప్రారంభం

వెంకోజీపాలెం, మార్చి 5: ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఆధునికీకరించిన విద్యార్థినుల హాస్టల్‌ని వీసీ ప్రసాదరెడ్డి మంగళవారం పారంభించారు. విద్యార్థినుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఈ భవనానికి మరమ్మతులు, టాయిలెట్స్, ఇతర మార్పులను పూర్తి చేసి తీర్చిదిద్దారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ స్టీఫెన్, ప్రిన్సిపాల్ శశిభూషణరావు, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి సింహాచలం క్షేత్ర మహాత్మ్యం పుస్తకం : ఈవో

సింహాచలం, మార్చి 5: వరాహలక్ష్మీనృసింహస్వామి కొలువుదీరిన సింహాచల క్షేత్రమహత్మ్యం పుస్తకం త్వరలో భక్తులకు అందుబాటులోకి తీసుకురానున్నట్టు ఈవో సింగల శ్రీనివాసమూర్తి తెలిపారు. అప్పన్న ఆలయ దక్షిణ రాజగోపురానికి చేరువగా మంగళవారం ఈఈ శ్రీనివాసరాజుతో కలిసి పుస్తక విక్రయ కేంద్రానికి భూమి పూజ నిర్వహించారు. క్షేత్రమహత్మ్యం పుస్తకాన్ని తెలుగు, ఇంగ్లీషు, ఒడియా భాషలలో ముద్రించాలని నిర్ణయించామన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబు

వెంకోజీపాలెం, మార్చి 5: ఇసుకతోటలోని వీరభద్రస్వామి ఆలయాన్ని నిర్వాహకులు శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబు చేస్తున్నారు. ఆ రోజు ఉదయం నుంచీ గౌరీదేవిగా కొలిచే రావిచెట్టు, ఈశ్వరునిగా బావించే జమ్మి చెట్టు కలిసి ఉన్న ఈ ప్రాంతంలో వీరభద్రస్వామికి అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తారు. మేళతాళాల మధ్య స్వామిని ఊరేగించి, భక్తుల గోత్రనామాలతో అభిషేకాలు చేస్తారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి మహిళలు ఉపవాసాలతో స్వామిని కొలుస్తారు. శివరాత్రి రోజున ఉదయం నుంచి అర్ధరాత్రి 12 వరకు పూజలు కొనసాగుతాయి. ఈమేరకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఆలయ ప్రాంగణమంతా శుభ్రం చేసి, రంగువల్లులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. 363 రోజులు చీకటిలో మెలిగే ఈ ఆలయం మహాశివరాత్రి పర్వదినం రెండు రోజులు విద్యుత్ కాంతులతో మెరిసిపోతుంది. అలాగే వెంకోజీపాలెంలోని రామానంద ఆశ్రమం, గౌరీజ్ఞాన లింగేశ్వరాలయంలో కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం నుంచి శివునికి అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తామని ప్రధానార్చకుడు సూర్యప్రకాశ్ శర్మ తెలిపారు.



శివరాత్రికి సుందరంగా తీర్చిదిద్దిన ఇసుకతోట వీరభద్రస్వామి ఆలయం

శివునికి వెయ్యి బిందెలతో జలాభిషేకం

ఆరిలోవ: పెదగదిలిలో వెలిసిన కాశీ అన్నపూర్ణ సహిత విశ్వేశ్వరస్వామి ఆలయం 23వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను సాయంత్రం మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ పురవీధులలో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆది దంపతులను దర్శించకున్నారు. అనంతరం స్వామిని వెయ్యి బిందెల నీటితో భక్తులు ప్రత్యేకంగా అభిషేకించారు. ఆలయ ప్రాంగణంలో బుధవారం మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు.

మహిళా కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

» ఆర్టీసీ విజయనగరం జోన్ ఈడీ రవికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ విజయనగరం జోన్ ఈడీ రవికుమార్

సింహాచలం, మార్చి 5: ఆర్టీసీలో పనిచేస్తున్న మహిళా కార్మికుల సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని విజయనగరం జోన్ ఈడీ సి.రవికుమార్ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు అధ్యక్షతన మంగళవారం సింహాచలం కాంప్లెక్స్ వద్ద ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఈయూ నేతలు మాట్లాడుతూ మహిళా కండక్టర్లకు రాత్రి 9 గంటలతో ముగిసేలా డ్యూటీలు వేయాలని, అన్ని డిపోల పరిధిలో ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఏర్పాటు చేయాలని, రెస్టు రూమ్‌లను నిర్మించాలని డిమాండ్ చేశారు. నెలసరి రోజుల్లో మూడురోజులు సెలవు ఇవ్వాలని ఉన్న ఆదేశాలను కొందరు సూపర్‌వైజర్లు అమలు చేయడం లేదన్నారు. చైల్డ్‌కేర్ నిమిత్తం ఆరునెలలు సెలవులివ్వాలన్న ప్రభుత్వ ఆదేశాలు అమలు కావడం లేదన్నారు. సమావేశంలో జోన్ అధ్యక్షులు కె.జె. శుభాకర్, కార్యదర్శి బాసూరి కృష్ణమూర్తి, పబ్లిసిటీ సెక్రటరీ పి. పద్మ, కె.కె.కుమారి, వి.భవాని, డీపీటీవో అప్పలరాజు, సీనియర్ మెడికల్ ఆఫీసర్ టి.వాణి, నిలిమ, సింహాచలం డిపో మేనేజర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'ఎడెక్స్ కంపెనీతో ఒప్పందం రద్దు చేయాలి'



కృష్ణ కళాశాల గేటు ఎదుట ఆందోళన చేస్తున్న పీడీఎస్‌వో కార్యకర్తలు

మద్దిలపాలెం, మార్చి 5: ఆన్‌లైన్ కోర్సుల పేరుతో ప్రభుత్వం ఎడెక్స్ కంపెనీతో చేసుకున్న ఒప్పందాన్ని రద్దుచేయాలని పీడీఎస్‌వో కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గేటు ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పీడీఎస్‌వో జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో కనీస మౌలికవసతులు, అధ్యాపకుల కొరత వెంటాడుతోందని, మరోవైపు ప్రభుత్వం రూ.50 కోట్లతో ఎడెక్స్ కంపెనీతో ఒప్పందం చేసుకోవడం దారుణమన్నారు. ఆన్‌లైన్ కోర్సుల పేరుతో టెండర్లు కూడా లేకుండా కంపెనీకి కోట్లు చెల్లించనున్నారన్నారు. ఈ బడ్జెట్‌తో ఎన్నో కళాశాలల్లో వసతులు కల్పించవచ్చునన్నారు. కొవిడ్ సమయంలో ఆన్‌లైన్ క్లాసుల వల్ల విద్యార్థుల్లో నైపుణ్యం, ప్రతిభ పడిపోయాయని గుర్తుచేశారు. రెండేళ్లగా బైజూస్ బోధనలో దుష్ఫలితాలను చవిచూస్తున్నామన్నారు. ఇప్పుడు ఆన్‌లైన్ కోర్సుల పేరుతో కళాశాల విద్యను నాశనం చేయొద్దని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

గీతంలో జాతీయ భద్రతా దినోత్సవం



అగ్ని ప్రమాదాల సమయంలో చర్యలపై నమూనా ప్రదర్శన

సాగర్‌నగర్, మార్చి 5: పనిచేసే ప్రదేశంలో భద్రత, ఉద్యోగుల ఆరోగ్య రక్షణపై అవగాహనతో మెలగాలని వక్తలు అన్నారు. భారత నౌకాదళం (ఐఎన్ఎస్ కళింగ), గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం భద్రతా దినోత్సవాన్ని నిర్వహించారు. గీతం వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం ముఖ్యఅతిథిగా మాట్లాడారు. బహుళ అంతస్తులు, టెక్నాలజీ విభాగాలు, విద్యుత్ సర్క్యూట్‌ల విషయంలో ప్రతి ఒక్కరు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఈ సందర్భంగా భారత నౌకాదళం భద్రత విభాగం అధికారులు లెఫ్టినెంట్ కమాండర్ జి.నరేశ్, లెఫ్టినెంట్ లింక అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నమూనా ప్రదర్శన ద్వారా వివరించారు. కార్యక్రమంలో గీతం సీనియర్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ డైరెక్టర్ బి.వి.రమణకుమార్, గీతం సెక్యూరిటీ విభాగం అధిపతి రామాంజనేయులు, సేఫ్టీ విభాగం అధికారి కె.పి. చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

దివీస్‌లో భద్రతా మాసోత్సవాలు ప్రారంభం



దివీస్‌లో భద్రతా మాసోత్సవ ర్యాలీని నిర్వహిస్తున్న దృశ్యం

భీమునిపట్నం (రూరల్): మండలంలోని చిప్పాడ దివీస్ పరిశ్రమలో మంగళవారం భద్రతా మాసోత్సవాలను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా రీజినల్ ఫైర్ ఆఫీసర్ టి. నిరంజన్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండా లని కోరారు. కర్మాగార పరిసరాల్లో ప్రజలను ప్రమాదాలపై చైతన్యవంతం చేయాలన్నారు. జిల్లా అగ్నిమాపక అధికారి రేణుకయ్య అగ్నిమాపక పరికరాల ప్రదర్శనను దివీస్ ఉపాధ్యక్షులు దేవేందరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భీమిలి ఫైర్ అధికారి శ్రీనివాసరాజు, దివీస్ జనరల్ మేనేజర్ కోటేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

గీతంను సందర్శించిన పెన్ స్టేట్ వర్సిటీ బృందం

సాగర్‌నగర్: అమెరికా పెన్సిల్వేనియాలోని పెన్‌స్టేట్ విశ్వవిద్యాలయ బృందం మంగళవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది. వర్సిటీ అంతర్జాతీయ వ్యవహారాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఒమిడ్ అన్సారీ, మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఠే.వెంకటరామణ్, జీవశాస్త్రాల ప్రొఫెసర్ డాక్టర్ సాయిరామ్ రుద్రభట్ల, విద్యార్థి వ్యవహారాల విభాగం సీనియర్ డైరెక్టర్ డాక్టర్ టోడ్‌క్లార్క్, గీతం వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానందసిద్దవట్టం, గీతం ప్రో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్ రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్‌లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అన్సారీ మాట్లాడుతూ గీతంతో పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకోవాలని నిర్ణయించారు. కార్యక్రమంలో వివిధ కళాశాలల డీన్‌లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

టీడీపీ సూపర్ సిక్స్‌తో ఎన్నో ప్రయోజనాలు



కరపత్రాలు పంచుతున్న పీవీ నరసింహం

సింహాచలం, మార్చి 5: రానున్న అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ప్రకటించి సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని గ్రేటర్ 98వ వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం అన్నారు. కాపువీధిలో మంగళవారం ఇంటింటికీ వెళ్లి పథకాలపై మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పంచదార్ల శ్రీనివాస్, బూర్లె కనకారావు, దాసరి పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ప్రియాంక దండి



తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో ప్రియాంక

సిరిపురం, మార్చి 5: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ప్రియాంక దండి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. బాధ్యతలు అప్పగించినందుకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్యం ఠాకూర్, పీసీసీ అధ్యక్షురాలు షర్మిల, మాజీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, శైలజనాథ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

ఏయూలో వృద్ధుల సమస్యలపై సలహాలు, శిక్షణ

వెంకోజీపాలెం, మార్చి 5: హెరిటేజ్ ఫౌండేషన్ రీజనల్ రిసోర్స్ అండ్ ట్రైనింగ్ సెంటర్ హైదరాబాద్, ఏయూ సోషల్ వర్క్స్ విభాగం ఆధ్వర్యంలో వృద్ధుల సమస్యలపై సలహాలు శిక్షణను మంగళవారం ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు ప్రారంభించారు. వృద్ధులకు సేవ చేయడం వరమని, అనాథ మృతదేహానికి దహన సంస్కారాలు చేస్తే ఎన్నో యజ్ఞాలు చేసినంత పుణ్యమని అన్నారు. వృద్ధులు ఒంటరితనాన్ని జయించాలంటే తనకు తానుగా పనులు కల్పించుకోవాలన్నారు. హెరిటేజ్ ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ కె.ఆర్.గంగాధరన్ మాట్లాడుతూ వృద్ధాశ్రమాలు ఏర్పడడానికి కారణాలు, వృద్ధుల రక్షణ చట్టాలు వివరించారు. ఈ కార్యక్రమంలో కె.విశ్వేశ్వరరావు, హరనాథ్, సాంబశివరావు, వివిధ వృద్ధాశ్రమాలలో పనిచేస్తున్న కౌన్సిలర్‌లు, మేనేజరులు, కేర్‌టేకర్‌లు పాల్గొన్నారు.

'మహిళల అభివృద్ధికి ప్రధాని కృషి'



మారథాన్‌లో బీజేపీ నాయకులు

ఆరిలోవ, మార్చి 5: మహిళల జీవితాల్లో పెనుమార్పులు తీసుకువచ్చేందుకు ప్రధాని మోదీ విశేష కృషి చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీఎస్ మాధవ్ అన్నారు. పార్టీ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు ఉమ్మిడి సుజాతరాజ్ ఆధ్వర్యంలో ఆరిలోవ బాలాజీనగర్ వద్ద ఏర్పాటుచేసిన నారీ శక్తి వందన్ మారథాన్‌లో మంగళవారం ఆయన పాల్గొని మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మోదీ అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టారన్నారు. వత్సరాయి రోహిణి, సుబ్బలక్ష్మి, మురళీమోహనరాజు, సన్యాసిరావు, వెంకటేశ్వరరావు, స్పందన పాల్గొన్నారు.

కార్మికులకు అండగా నిలిచిన రామ్మోహన్‌రావు



నివాళులర్పిస్తున్న శ్రీనివాసరావు

ద్వారకాబస్‌స్టేషన్, మార్చి 5: ఆర్టీసీలో నేషనల్ మజ్దూర్ యూనియన్‌ను స్థాపించి కార్మికులకు అండగా నిలిచిన పి.రామ్మోహన్ రావు కార్మికులకు ఆరాధ్యుడని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు అన్నారు. మద్దిలపాలెం రామ్మోహన్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన రామ్మోహన్ 19వ వర్ధంతిలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని నిరంతరం పనిచేశారన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జోనల్ ఛైర్మన్ సూర్యం, జోనల్ కార్యదర్శి ఎంవీఆర్ మూర్తి, సంయుక్త కార్యదర్శి ఈశ్వరరావు, మద్దిలపాలెం డిపో కార్యదర్శి పాలపర్తి చిన్నా, అధ్యక్షుడు ఎం.ఈశ్వరరావు, డివిజనల్ కార్యదర్శి ఏకే శివాజీ, రీజనల్ సంయుక్త కార్యదర్శి కేవీఎస్ఎన్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **చారి 111 :** వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక).
- **భూతద్దం భాస్కరనారాయణ :** శారద, శరత్, ఊర్వశి (కంచరపాలెం) సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), నటరాజ్ (పెందుర్తి).
- **ఇంటి నెం.13 :** లీలామహల్.
- **మా ఊరి రాజారెడ్డి :** క్రాంతి
- **రాధా మాధవం :** మౌర్య (గోపాలపట్నం)
- **భ్రమయుగం :** జగదాంబ, హెవెన్ (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **సుందరం మాస్టర్ :** శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సప్తగిరి (తగరపువలస)
- **సిద్దార్థ్ రాయ్ :** శ్రీరామ, శ్రీకన్య, మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **ఊరు పేరు భైరవకోన :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్ ఊర్వశి, నరసింహ (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ఈగల్ :** రమాదేవి,
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 25, టమాటా 17, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 44, బెండకాయలు 30, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 44, బీరకాయలు 38, ఆనపకాయ 15, కాలీఫ్లవర్ 24, క్యాబేజి 20, క్యారెట్ 24, దొండకాయలు 26, బంగాళదుంపలు 20, అరటికాయ 7, మునక్కాడలు (కిలో) 55, అల్లం (పాతది) 110, బరబాటి 15, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 32, దోసకాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 150, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 44, ఆగాకర 52, పొటల్స్ 62, కీరదోస 30, కాప్సికమ్ 52, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 52, చిలగడదుంపలు 24, కంద 64, దేముడు చిక్కుడు 56, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	112
ఫారం ధర	--	132
విత్ స్కిన్	--	234
స్కిన్‌లెస్	--	244

మరికొన్ని సిటీ వార్తలు పేజీ8లో..

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



హనుమంతవాక కూడలిలో ప్రచారం చేస్తున్న దృశ్యం

ఆరిలోవ, మార్చి 5: మహాశివరాత్రి సందర్భంగా త్రైత సిద్ధాంత ప్రచార సమి తి సభ్యులు మంగళవారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై హనుమంతవాక కూడలిలో ప్రచారం నిర్వహించారు. శివరాత్రిలో శి అనే బీజాక్షరం అగ్నికి, వ నీటికి గుర్తు అన్నారు. కర్మను కాల్చి వేసే అగ్నిని జ్ఞానాగ్ని అంటారన్నారు. రాత్రి అటే త్రి గుణములు లేని మోక్షానికి గుర్తని, జాగరణ అంటే మాయ పట్ల జాగృతి, జ్ఞానం పొంది దైవజ్ఞానాన్ని తెలియజేయడమేనన్నారు. శ్రీనివాస్, రమణ, అప్పారావు, మంగ, అరుణ్, రమ, పద్మాదేవి, నాగమణి, రమేష్, అక్షయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

కనుమరుగవుతున్న గ్రీన్ బెల్ట్

» ఆక్రమణలు, వ్యర్థాల డంపింగ్‌తో అస్తవ్యస్తం



గ్రీన్‌బెల్ట్‌లో పేరుకుపోయిన వ్యర్థాలు



గ్రీన్‌బెల్ట్‌ను ఆక్రమించి వేసిన భవన నిర్మాణ సామగ్రి

ఆరిలోవ, మార్చి 5: జీవీఎంసీ 9, 10, 11, 12, 13 వార్డుల పరిధిలోని బీఎస్ఆర్‌టీలో సర్వీసు రోడ్డునకు ఆనుకుని 20 అడుగుల మేర గ్రీన్‌బెల్ట్ అభివృద్ధి చేశారు. ప్రస్తుతం ఇది కనుమరుగవుతుండడంతో ప్రకృతి ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని పచ్చదనాన్ని తొలగించి, స్థానికులు ఆక్రమణలకు తెగబడుతున్నారు. మేయర్ క్యాంపు కార్యాలయం వద్దా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. సమీప శివాలయం వద్ద ఆక్రమించి, వంటశాల షెడ్‌ను నిర్మించేశారు. మరికొంత దూరంలో రాతి గుట్టలు, స్క్రాప్ వస్తువులతో గ్రీన్‌బెల్ట్ నిండిపోయింది. పలుచోట్ల జీవీఎంసీ క్రీడా పరికరాలు ఏర్పాటు చేసింది. ఇటీవల ఈ ప్రాంతంలో పర్యటించిన జీవీఎంసీ కమిషనర్‌కు ఆక్రమణలపై స్థానికులు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన గ్రీన్‌బెల్ట్‌ను పరిరక్షించాలని అధికారులను ఆదేశించినప్పటికీ పట్టించుకోలేదు.